

ఉలిక్కిపడ్డ సూళ్లూరుపేట



బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం

ఆరుగురికి గాయాలు

ముగ్గురి పరిస్థితి విషమం

నిబంధనల ఉల్లంఘనపై లైసెన్సు రద్దుకు సిఫార్సు



ఆస్పత్రిలో క్షతగాత్రులు - కాలిన గాయాలతో రవి →

సూళ్లూరుపేట, మార్చి 19: టపాకాయల తయారీ కేంద్రంలో సంభవించిన పేలుడుతో మంగళవారం మధ్యాహ్నం సూళ్లూరుపేట ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పట్టణ సమీపంలోని వట్రపాలెం దగ్గర్లో జాతీయ రహదారి పక్కనే మదీనా గ్రాండ్ ఫైర్ వర్క్స్ పేరుతో బాణసంచా తయారీ కేంద్రం చాలాకాలంగా నిర్వహిస్తున్నారు. దీని లైసెన్సుదారులు ముతీష్, ఆయన భార్య సాధీనబేగం కాగా ఈ కేంద్రాన్ని ప్రస్తుతం వారి కుమారులిద్దరు నిర్వహిస్తున్నారు.11 గంటల సమయంలో టపాకాయల తయారీ కేంద్రంలో ప్రమాదం చోటు చేసుకోగా



ఆస్పత్రి వద్ద వైద్యులను వివరాలడిగి తెలుసుకొంటున్న ఆర్డీవో, డీఎస్పీ

ఒక్కసారిగా భారీ శబ్దాలతో పేలుళ్లు సంభవించాయి.దీంతో ఎగిసిన మంటల తాకిడికి బయట ఉన్న టపాకాయల నిల్వలు కూడా పేలిపోయాయి.ఈ పేలుళ్ల ధాటికి గోదాములోనే పనిచేస్తున్న ముగ్గురు కూలీల శరీరం చాలావరకూ కాలిపోయింది. మరో ముగ్గురికి గాయాలయ్యాయి.గాయపడిన వారిలో బీహార్‌కు చెందిన శంకర్ చౌదరి, పింకేష్ జాదవ్, రాజ్‌కుమార్, గండ్ మండేల్, జార్ఖండ్‌కు చెందిన రవిలతో పాటు వట్రపాలేనికే చెందిన కందుకూరి శివకుమార్ వున్నారు.గోడౌన్ నుంచి శబ్దాలు విన్న చుట్టుపక్కల జనం ఏమి జరిగిందో తెలియక టపాసుల గోడౌన్ వైపు పరుగులెట్టారు. పేలుళ్లు, మంటలతో ఉన్న వాతావరణం చూసి అందరూ భయపడిపోయారు. గోడౌన్ నుంచి మంటలతో కూడిన దట్టమైన పొగలు వస్తుండడంతో ఇంకా పేలుడు మందులు ఉన్నాయోమోనన్న అనుమానంతో అక్కడకు చేరుకొన్న జనాలు కొంతసేపు హైవే రోడ్డు పైనే ఉండిపోయారు.ఈలోపు క్షతగాత్రుల్లో ఇద్దరు మంటల్లో నుంచి బయటకు వచ్చి లోపల ఇంకా కూలీలున్నారని చెప్పడంతో కాలిన గాయాలతో ఉన్న నలుగురిని స్థానికులే బయటకు తీసుకొచ్చారు. వారిని ఆటోల్లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకొన్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపుచేశారు. ఆర్డీవో చంద్రముని, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, డీఎస్పీ శ్రీనివాసుల రెడ్డి, సీఐ మధుబాబు, ఎస్ఐ రహీం రెడ్డి అక్కడకు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకొన్నారు. బాణసంచా గోదాము వద్ద నిబంధనల మేరకు ఎటువంటి జాగ్రత్త చర్యలు కూడా లేనట్లు గుర్తించారు. పేలుడుకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు ఆర్డీవో తెలిపారు.తరువాత ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించి ప్రమాదం ఎలా జరిగిందో అడిగి తెలుసుకొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు.తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు.పేలుడు సంఘటనపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. టపాసుల తయారీ కేంద్రం లైసెన్సు రద్దుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేశామని ఆర్డీవో తెలిపారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్షితను చంపిన చిరుత గుర్తింపు

● అడవిలో వదలం.. జూలోనే ఉంచుతాం: అటవీశాఖ అధికారి



మంగళం, మార్చి 19: తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తిరుమల కాలి నడకదారిలో వెళుతున్న నెల్లూరు బాలిక లక్షితపై దాడిచేసి, క్రూరంగా చంపేసిన చిరుతను గుర్తించారు. 2023 ఆగస్టులో ఈ హృదయ విదారకమైన ఘటన జరిగింది. వెంటనే స్పందించిన టీటీడీ, అటవీశాఖ అధికారులు దాడి జరిగిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీప ప్రాంతాల్లో బోన్లను ఏర్పాటు చేశారు. వరుసగా ఆరు చిరుతలు చిక్కాయి. వీటినుంచి పలు నమూనాలను, లక్షితకు సంబంధించిన నమూనాలను ల్యాబ్‌కు పంపారు. ముందుగా పట్టుబడ్డ మూడు చిరుత నమూనాల్లో లక్షితను చంపినట్లు ఆధారాలు లభించలేదు. నాల్గవ చిరుత నమూనాల్లో ఆధారాలు లభించాయి. ల్యాబ్ నుంచి ఆధారాలు నెలరోజుల్లో వస్తాయని అటవీశాఖ అధికారులు భావించినా.. దాదాపు ఏడు నెలలు సమయం పట్టింది. కాగా, ముందుగా పట్టుబడ్డ మూడు చిరుతల్లో రెండింటిని జనారణ్యానికి దూరంగా అటవీప్రాంతంలో వదలిపెట్టారు. ఓ చిరుతను విశాఖపట్టణం జూకు తరలించారు. మిగిలినవి జూలోనే ఉన్నాయి. మంగళవారం ల్యాబ్ నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా లక్షితను చంపిన నాల్గవ చిరుతను జూపార్కులోనే ఉంచనున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎందుకంటే ఈ చిరుత.. జంతువులను వేటాడి తినే పరిస్థితిలో లేదని, కోరపళ్లు నాలుగు రాలిపోయాయన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకునే జూపార్కులోనే ఉంచాలని నిర్ణయించినట్లు వివరించారు.

టెన్త్ పరీక్షకు 1073 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి 19: పదో తరగతి పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 1,073 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ చెప్పారు. మంగళవారం లాంగ్వేజ్-2 పరీక్ష జరిగింది. 27,878 మంది హాజరుకావాల్సి ఉండగా 26,805 మంది హాజరయ్యారు. 03.85 శాతం మంది గైర్హాజరవగా, 96.15 శాతం మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

పరీక్షల విధులనుంచి సీఎస్, డీవో తొలగింపు

సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఓ ఛీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో)ను పరీక్షల విధులనుంచి డీఈవో తొలగించారు. స్థానిక తిరుమల బైపాస్ రోడ్డులోని రత్నం హైస్కూల్లో పరీక్షకు హాజరైన వర్షిణి హాల్ టికెట్‌లో లాంగ్వేజ్-1కి సంబంధించి స్టార్ గుర్తులు ఉండడంతో సీఎస్, డీవో తికమక పడ్డారు. విద్యార్థినిని పరీక్ష కేంద్రం నుంచి బయటకు పంపేశారు. దాంతో ఆ విద్యార్థిని బోరున విలపిస్తూ కేంద్రం బయటకు వచ్చింది. ఆమె కుటుంబీకులు ఈ విషయాన్ని విద్యాశాఖాధికారులకు తెలియజేశారు. పరిశీలించిన ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ సంచాలకుడు (ఏసీ) గురుస్వామిరెడ్డి ఆ విద్యార్థిని అనుమతించాలని పరీక్ష కేంద్రం సీఎస్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో పరీక్ష ప్రారంభమైన అరగంట తర్వాత ఆమెను పరీక్షకు అనుమతించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ పరీక్షల విధులనుంచి సీఎస్, డీవోలను డీఈవో తొలగించారు.

బరి తెగించారు!

స్వర్ణముఖిలో పేట్రేగిపోతున్న ఇసుక మాఫియా





తిరుచానూరు, మార్చి 19: వాగూవంక తేడా లేకుండా ఇష్టానుసారం వైసీపీ నేతలు ఇసుక,మట్టి దోచేస్తున్నారు.తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం నుంచి రేణిగుంట మండల సరిహద్దు వరకు స్వర్ణముఖి నదిలో మట్టి, ఇసుకను కొంత మంది వైసీపీ నేతలు ప్రధాన ఆదాయ వనరులుగా మార్చుకున్నారు. తిరుచానూరు సమీపంలోని స్వర్ణముఖి నదిలో హిటాచి, ఎక్సకవేటర్లతో ట్రాక్టర్లతో మట్టిని తవ్వి వెంచర్లకు తరలిస్తున్నారు.నదిలో ఎక్కడికక్కడ గోతులు తవ్వేసి టన్నుల కొద్దీ మట్టి, ఇసుకను తీసుకెళుతున్నా అధికారుల్లో స్పందన లేదు.రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. నియోజకవర్గంలో ముఖ్యనేత వేస్తున్న అక్రమ వెంచర్‌కు వందల ట్రాక్టర్లతో రాత్రీపగలూ తేడా లేకుండా మట్టి రవాణా సాగుతోంది.ఇలాగే మరికొన్ని రోజులు సాగితే భూగర్భ జలాలు అడుగంటిపోయి తిరుచానూరు, పాడిపేట, ముండ్లపూడి ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రమయ్యే అకాశం ఉంది.

తిరుపతిలో నెలాఖరులోపు బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

● పీజీఎం అమరేంద్ర రెడ్డి



తిరుపతి సెంట్రల్ మార్చి 19: తిరుపతి నగరంలో ఈనెలాఖరులోపు బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని జిల్లా ప్రిన్సిపల్ జనరల్ (పీజీఎం) మేనేజరు సి.అమరేంద్ర రెడ్డి తెలిపారు. నాలుగేళ్ల కిందటి నుంచే ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లె, చిత్తూరు, పీలేరు, పుంగనూరు, పలమనేరు, కలికిరి, పాకాల కేంద్రాల్లో విదేశీ పరిజ్ఞానంతో 4జీ సేవలను అంచెలంచెలుగా మొదలుపెట్టారు. అలాగే తిరుపతిలోనూ ప్రారంభిస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. అయినా నగరంలో ఇప్పటి వరకు 4జీ సేవలు అందుబాటులోకి రాలేదు. ఈ నేపథ్యంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన పరికరాలు వస్తున్నాయని, ఇవి వచ్చాక 4జీ సేవలు ప్రారంభిస్తామని పీజీఎం అన్నారు.

38 నూతన టవర్ల మంజూరు

తిరుపతి పరిధిలో 38 నూతన 4జీ టవర్లు మంజూరయ్యాయి. వీటిల్లో మొదటి విడతగా 18 టవర్లు నెలాఖరులోపు అందుబాటులోకి రానున్నట్లు సమాచారం.

మేకిన్ ఇండియాలో భాగంగా..

మేకిన్ ఇండియాలో భాగంగా.. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 4జీ పరికరాలను కేంద్రప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌కు సమకూరుస్తున్నట్లు సమాచారం. ఈ పరికరాలు మరో వారంలో తిరుపతికి చేరనున్నాయని అధికారులు తెలిపారు.

ఆస్పత్రి ఆవరణలో మద్య సేవనం

● విధుల్లో ఉండగా పట్టుబడ్డ రుయా వాటర్ మ్యాన్

● బార్‌ను తలపించేలా సీఐటీయూ కార్యాలయం





నాలుగు రోజుల కిందట విధుల్లో ఉండగా మరో వ్యక్తితో కలిసి మద్యం తాగుతూ పట్టుబడ్డ ఉద్యోగి - సీఐటీయూ కార్యాలయంలో మద్యం బాటిళ్లు, గ్లాసులు

తిరుపతి సిటీ, మార్చి 19: రుయాస్పత్రి ఆవరణలోని ఓ కార్యాలయం వెనుక గదిలో మరో వ్యక్తితో కలిసి ఓ ఉద్యోగి మద్యం తాగుతూ అధికారులకు పట్టుబడ్డాడు. ఆస్పత్రిలో వాటర్‌మ్యాన్‌గా పనిచేసే సుబ్రహ్మణ్యం ఓపీ కేంద్రం ఎదురుగా ఉన్న సీఐటీయూ కార్యాలయంలో నాలుగు రోజుల కిందట మధ్యాహ్నం మద్యం తాగుతున్నాడన్న సమాచారంతో ఏఆర్ఎంవో హరికృష్ణ అక్కడికెళ్లారు. మరో వ్యక్తితో కలిసి వాటర్ మ్యాన్ సుబ్రహ్మణ్యం మద్యం తాగుతుండటాన్ని గుర్తించారు. బారును తలపించేలా కార్యాలయం వెనుక ఓ గదిని ఏర్పాటు చేసి.. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విధుల్లో ఉండాల్సిన ఉద్యోగి దర్జాగా మద్యం తాగుతూ ఉండటాన్ని ఆయన గమనించి వెంటనే కార్యాలయానికి పిలిపించారు. కానీ తర్వాత ఏం జరిగిందో.. మద్యం తాగుతూ పట్టుబడ్డ ఉద్యోగిని మందలించి పంపేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే.. వాటర్‌మ్యాన్‌కి అండగా అధికార పార్టీ నేతలు ఉండటంతో ఆయన గతంలోనూ విధుల్లో ఉన్నప్పుడు ఆస్పత్రిలోనే మద్యం తాగేవాడని చెబుతున్నారు. అధికార పార్టీ నేతలతో ఉన్న సంబంధాలకు తలొగ్గి.. అధికారులు సైతం ఆయనపై చర్యలు తీసుకోవడానికి సాహసించడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

మడిబాక వలంటీరుపై వేటు

ఏర్పేడు, మార్చి 19: వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఒక వలంటీరును విధుల నుంచి తొలగించారు.ఏర్పేడు మండలం మడిబాకలో సోమవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి చేపట్టిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో అదే గ్రామానికి చెందిన వలంటీరు ముసలిపేడు మురళి పాల్గొన్నారు.ఈ విషయంపై మీడియాలో వార్తలు రావడంతో స్పందించిన కలెక్టర్ లక్ష్మీశ వెంటనే విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు.దీంతో ఎంపీడీవో గిడ్డయ్య వలంటీరు మురళిని విధుల నుంచి మంగళవారం తొలగించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : సా. 6.27

సహరి (గురువారం) : ఉ. 4.57



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

లక్ష్యం చేరే వరకు విశ్రమించొద్దు

● ఎంబీయూ విద్యార్థులకు మోహన్‌లాల్ పిలుపు ● ప్రధానిగా మళ్లీ మోదీయే రావాలన్న మోహన్‌బాబు



మోహన్‌బాబుతో మోహన్‌లాల్, మంచు విష్ణు

చంద్రగిరి, మార్చి 19 : ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించే వరకు విశ్రమించొద్దని ప్రముఖ సినీనటుడు మోహన్‌లాల్ విద్యార్థులకు పిలుపిచ్చారు.చంద్రగిరి మండలం, ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో విద్యానికేతన్ విద్యాసంస్థల 32వ వార్షికోత్సవం, మోహన్‌బాబు జన్మదిన వేడుకలు మంగళవారం అట్టహాసంగా జరిగాయి.ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీనటులు మోహన్‌లాల్, ముకేష్ రిషి హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్ విద్యార్థులను ద్దేశించి మాట్లాడుతూ విద్యను ప్రసన్నం చేసుకొంటే ప్రపంచంలో ఏదైనా సాధించవచ్చని తెలిపారు.సినిమా రంగంలో కొనసాగుతూనే మోహన్‌బాబు విద్యాసంస్థను స్థాపించి విశ్వవిద్యాలయం స్థాయికి తీసుకురావడం అభినందించదగ్గ విషయమన్నారు.అనంతరం మోహన్‌బాబు మాట్లాడుతూ ప్రధానమంత్రిగా మళ్లీ నరేంద్ర మోదీయే రావాలని ఆకాంక్షించారు. ఏ పార్టీని నమ్మాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రాంతీయ పార్టీల గురించి తాను ప్రస్తావించనని ,మళ్లీ ప్రధానిగా నరేంద్రమోదీ వస్తే దేశం బాగుపడుతుందనేది తన మనసులో మాట అన్నారు. డబ్బులు అందరూ ఇస్తారని, అవి తీసుకుని మనసుకు నచ్చిన వారికే ఓటు వేయాలన్నారు.విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. హీరో విష్ణు కుమార్తె ఆరియాన ఆలపించిన పాశ్చాత్య సంగీతం ఆకట్టుకుంది.మనోజ్‌కుమార్ తనకు తండ్రితో ఉన్న అనుబంధాన్ని డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శించారు.ఎంబీయూ వీసీ నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారధి, మోహన్‌బాబు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



సీఆర్ రాజన్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా సీఆర్‌రాజన్

తిరుపతి/తిరుచానూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడిగా తిరుచానూరు మాజీ సర్పంచ్ సీఆర్ రాజన్ నియమితులయ్యారు.వన్నియకుల క్షత్రియ సంఘం రాష్ట్ర కోశాధికారిగా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పని చేసిన రాజన్ ఈ ఎన్నికల్లో చిత్తూరు అసెంబ్లీ టికెట్ ఆశించారు.చిత్తూరుకు మకాం మార్చి కొంతకాలం చురుగ్గా పనిచేశారు. అయితే పలు సమీకరణల కారణంగా ఆయనకు టికెట్ దక్కలేదు. దానివల్ల ఆయనకు పార్టీలో సముచిత గుర్తింపు, గౌరవం కల్పించడంతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో గణనీయంగా వున్న వన్నెకుల క్షత్రియ సామాజికవర్గాన్ని సంతృప్తి పరిచేందుకు రాజన్‌కు కీలక పదవి కట్టబెట్టారు. కుప్పం మొదలుకుని చిత్తూరు, చంద్రగిరి, నగరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో వన్యకుల క్షత్రియులు అధికంగా వున్నారు. ఆ సామాజికవర్గంలో ప్రాబల్యం కలిగిన రాజన్‌కు చిత్తూరు పార్లమెంటు అధ్యక్ష పదవి కేటాయించడం టీడీపీకి గణనీయంగా లాభించనుంది. చంద్రగిరి ఎన్నికల సమరంలో పోరాడుతున్న నానీ వ్యూహాత్మకంగా రాజన్‌కు ఈ పదవి దక్కేలా చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం.అలాగే చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షులుగా ఇ.శ్రీనివాసులు (చిత్తూరు) పీసీ మణి (రామ చంద్రా పురం), వాణిజ్యవిభాగం ఉపాధ్యక్షుడిగా ఎస్‌ఏ ప్రసాద్ రెడ్డి, ఎం.గోపి (చిత్తూరు), సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షుడిగా జి.రమేష్, టీచర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా ఎస్.నరసింహాలు (చిత్తూరు) నియమితులయ్యారు.కాగా సీఆర్ రాజన్‌కు ఉన్నత పదవి లభించిన సందర్భంగా మంగళవారం టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, కిషోర్‌రెడ్డి, సాయి రాయల్, మునిరత్నంరెడ్డి, శ్రీధర్‌నాయుడు,హరినాథ్‌రెడ్డి, వాసు, బీజేపీ నేతలు పురుషోత్తంనాయుడు తదితరులు కలిసి అభినందించారు.

మోహన్‌బాబుకు పలువురి శుభాకాంక్షలు



మోహన్‌బాబుతో చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మోహిత్‌రెడ్డి

చంద్రగిరి, మార్చి 19: సినీనటుడు మోహన్‌బాబు జన్మదిన వేడుకలను మంగళవారం విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, తుడా ఛైర్మన్ మోహిత్ రెడ్డి, చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధర రావు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్,బాలకృష్ణమూర్తి, రమేష్‌రాయల్,గౌస్‌బాషా, జగన్మోహన్‌నాయుడు, దేవిలాల్,మంచు యువసేన అధ్యక్షుడు సునీల్‌చక్రవర్తి తదితరులు మోహన్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంబీయూలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి సేకరించిన రక్తాన్ని తిరుపతి రుయా, మెటర్నిటీ, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు. ఎంబీయూ ప్రొఛాన్సలర్ మంచు విష్ణు ,వీసీ నాగరాజారామ్ రావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనంపై నానీ పర్యటన



చంద్రగిరి, మార్చి 19: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని మంగళవారం చంద్రగిరిలో ద్విచక్ర వాహనంపై తిరుగుతూ ఆత్మీయులను, ముఖ్య నేతలను కలిశారు. వారి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈసారి గెలుపు సాధించేందుకు సమష్టిగా పనిచేద్దామని కోరారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, రమేష్‌రెడ్డి, గౌస్‌బాషా, కొండూరు ప్రవీణ్, దుబాసి రామ్మూర్తి, బీజేపీ నాయకులు వెంకటముని, మునిగంగిరెడ్డి, తులసేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలరెడ్డి

పాకాల, మార్చి 19: కాంగ్రెస్ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పీసీసీ ఉపాధ్యక్షుడు వేణుగోపాల రెడ్డి పిలుపునిచ్చారు. పాకాలలో మంగళవారం డీసీసీ అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షుడు పటాన్ మస్తాన్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కేపీఎస్.వాసు, అధికార ప్రతినిధి ప్రభాకర్, లీగల్ సెల్ కార్యదర్శి అనిల్, లోకేష్‌రెడ్డి, ముని, విరుపాక్ష నవీన్ రెడ్డి, రాజ, షఫీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం



పాకాల, మార్చి 19: మండలంలోని పెద్దగొర్పాడు పంచాయతీ పరిధిలో టీడీపీ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలుగు మహిళలతో కలిసి పెద్దగొర్పాడు, కొత్తపల్లె, బావిరాగన్న చెరువు, ఓబులశెట్టి వారిపల్లెల్లో ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సోదరి ధనలక్ష్మి ఆధ్వర్యంలో తిరుగుతూ నానీని ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు.

కుక్కల దాడిలో గాయపడ్డ జింక మృతి



గాయపడ్డ జింకకు వైద్యం చేస్తున్న పశువైద్యాధికారులు

రామచంద్రాపురం, మార్చి 19: తిరుపతి-పచ్చికాపల్లం ప్రధాన రహదారి రాయలచెరువుపేట వద్ద మంగళవారం ఉదయం కుక్కలు దాడి చేయడంతో జింక మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అడవి నుంచి దాహార్తి తీర్చుకునేందుకు ఓ జింక మంగళవారం ఉదయం రాయలచెరువుపేట పొలాల్లోకి వస్తుండగా కుక్కలు చుట్టుముట్టి దాడి చేసాయి. ఇదే సమయంలో పచ్చికాపల్లం నుంచి తిరుపతి వైపు వస్తున్న ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్‌స్వామి ఆ జింకను రక్షించి ఆటోలో కుప్పంబాదూరు పశువైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అనంతరం గాయపడిన జింకను కార్వేటినగరం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. జింక తీవ్రంగా గాయపడటంతో సాయంత్రం మృతిచెందింది. అటవీశాఖ సిబ్బంది జింకకు పంచనామా నిర్వహించి దహనం చేశారు.

వైసీపీకి ఇద్దరు రాజీనామా

రామచంద్రాపురం, మార్చి 19: మండలంలోని గణేశ్వరపురం వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాబునాయుడు, కమ్మపల్లి నీలకంఠ చౌదరి పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. పులివర్తి నాని సమక్షంలో బుధవారం టీడీపీలో చేరనున్నట్లు వారు ప్రకటించారు.

దశ తీర్థమాల గోవింద

- నిధులిచ్చేవారు లేక ఆగిపోయిన వైనం
- మరోసారి అనుమతుల కోసం అటవీశాఖ ప్రయత్నం



మంగళం, మార్చి 19: తిరుమలలోని పది పవిత్రమైన తీర్థాలను దర్శించుకోవడానికి వీలుగా అటవీశాఖ రూపొందించిన దశ తీర్థమాల నిధుల లేమితో అటకెక్కింది. గత ఏడాది ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసిన అటవీశాఖ ఇందుకు సంబంధించిన అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినా నిధుల లేమి సమస్యగా మారింది. ఈ ప్రాజెక్టుకు దాదాపుగా రూ.10కోట్లు అంచనా వేశారు. తొలుత పాపవినాశనం దగ్గర నుంచి భక్తులను ప్రత్యేక వాహనాల్లో ఎక్కించుకుని సమీప తీర్థాలను దర్శింపచేయాలనేది ఆలోచన. దీనికి భక్తుల స్పందన పెరిగితే వచ్చే ఆదాయంతో మిగతా తీర్థాల సందర్శనకు అవసరమైన సౌకర్యాలను కల్పించుకోవాలన్నది అటవీ శాఖ ఆలోచన. కానీ పాపవినాశనం దగ్గర నుంచి సమీప తీర్థాల దగ్గరకు వెళ్లాలంటే అవసరమన వాహనాలు, సిబ్బంది, రహదారులు, కొన్నిచోట్ల వంతెనలు, డ్రోన్లు వంటి ఆధునిక పరికరాలు అవసరమవుతాయి. వీటికి దాదాపుగా రూ.70లక్షలు కావాల్సి ఉంటుంది. దీనికి ప్రభుత్వాల నుంచి ఆర్థికపరమైన భరోసా లభించలేదు. మరోసారి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడానికి అటవీ శాఖ సిద్ధమవుతోంది.

ఇవి మఠం భూములు కాదా?

- ఈ అక్రమ నిర్మాణాలను మాత్రం తొలగించరెందుకు?
- ప్రశ్నిస్తున్న ఇళ్లను కోల్పోయిన బాధితులు,గ్రామస్తులు



మఠం భూమిలో కట్టిన ఇంటి గోడపై రాసి ఉన్న చిరునామా

తుమ్మలగుంట మఠంభూముల్లో కట్టిన ఇళ్లకు విద్యుత్ కనెక్షన్



తిరుపతి రూరల్,మార్చి19 : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట పంచాయతీ పరిధిలో సర్వేనెంబరు 74-84వరకు ఉన్న హథీరాంజీమఠం భూముల్లో వందలసంఖ్యలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను మఠం అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారితీస్తోంది.ఇదే పంచాయతీ పరిధిలో నిర్మించిన దాదాపు 40 ఇళ్లను ఈ నెల 6వ తేదీ తెల్లవారుజామున పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో కూలగొట్టిన మఠం అధికారులు..అదేప్రాంతానికి కూతవేటు దూరంలో తుమ్మలగుంట నుంచి పేరూరు వెళ్లే మార్గంలోని చెంచులక్ష్మి కాలనీ ఎదురుగా కేవీఎస్(కల్యాణ వేంకటేశ్వరస్వామి) నగర్ పేరిట చేపట్టిన అక్రమ నిర్మాణాలు, ప్రస్తుతం కూడా నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఎందుకు తొలగించడంలేదని గ్రామస్తులతో పాటు ఇళ్లను కోల్పోయిన బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఈ భూమి హథీరాంజీమఠానికి చెందింది కాదా..? దీనిలో చేపట్టినవి అక్రమ నిర్మాణాలు కావా అని ప్రశ్నిస్తున్నారు. ఎవరి ప్రయోజనాలకోసం తమ ఇళ్లను మాత్రమే కూలగొట్టి..మిగిలిన అక్రమ నిర్మాణాలవైపు కన్నెతిచూడడంలేదని నిలదీస్తున్నారు. తాము కొనుగోలు చేసిన భూములతో పాటు సర్వేనెంబరు 74నుంచి 84వరకు ఉన్న భూములన్నీ కూడా గతంలో తుమ్మలగుంట గ్రామానికి చెందిన రైతులకు హథీరాంజీ మఠం ఇచ్చిన లీజువారి పట్టా భూములేనని గుర్తు చేస్తున్నారు. తమ భూములకు సమీపంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి కుటుంబసభ్యుల ఆధీనంలో దాదాపు 20ఎకరాలకుపైగా మఠం భూములుండడం వల్లే పెద్దల ప్రయోజనాల కోసం బలవంతంగా ఇళ్లను కూలగొట్టారని బాధితులు, గ్రామస్తులు ఆరోపిస్తుండడం గమనార్హం. కాగా తుమ్మలగుంట గ్రామపరిధిలో మఠానికి 165.78ఎకరాల

కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ ఎదురుగా మఠం భూముల్లో నిర్మాణాలు



భూమిఉంది. 7/6,26/3,28,33, 66-95, 97,98,99,100,101 సర్వే నెంబర్లలో ఉన్న ఈ భూమిలో ఎప్పట్నుంచో ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గతంలో నిర్మించిన కొన్ని నిర్మాణాలకు మఠం అధికారులు నోటీసులిచ్చినా గానీ తొలగింపులో అడ్డంకులు ఎదురవడంతో మిన్నకుండిపోయారు. ప్రత్యేకించి మఠం భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలకు కరెంటు మీటర్లు ఎలా ఇచ్చారన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీనికి తోడు ఈ భూములన్నీ గ్రామస్తుల వద్ద కొనుగోలు చేసినవే. వీటిని విక్రయించిన వారిలో ఎమ్మెల్యే కుటుంబీకులు కూడా ఉండడం గమనార్హం. అలాగే మఠం భూముల్లో చేపట్టిన నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ కూడా ఎమ్మెల్యే తమ్ముడి దగ్గరే కొనుగోలు చేసి ఇళ్లను నిర్మిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



మఠం అధికారులు కూలగొట్టిన ఇళ్ల సమీపంలో చేపట్టిన నిర్మాణాలు

శుభ్రం చేయరా?

- చెత్తాచెదారం నడుమ

పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలు



పంచాయతీరాజ్ కార్యాలయం వెనుక వైపు



ఓవైపు కూలిన టూవీలర్ షెడ్

తిరుపతి (రవాణా), మార్చి 19: చెన్నారెడ్డి కాలనీలో ఉన్న పంచాయతీరాజ్ (పీఆర్), ఆర్‌డబ్ల్యూఎస్ (గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్య విభాగం) కార్యాలయాలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. రెండు కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. పీఆర్ ఉద్యోగుల సౌకర్యార్థం నిర్మించిన టూవీలర్ షెడ్ ఓవైపు కూలిపోయినా పట్టించుకునేవారు కరువయ్యారు. కార్యాలయం వెనుక వైపు అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముందు కూడా ఎక్కడి చెత్త అక్కడ దర్శనమిస్తోంది. మరోవైపు వినియోగంలో లేని వాహనాలన్నీ కూడా కార్యాలయం ముందుంచేశారు.



పేరుకుపోయిన చెత్త



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముందు వినియోగంలో లేని కార్లు

మహిళా వర్సిటీలో నేడు జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19: పద్మావతి మహిళా యూనివర్సిటీలో బుధవారం జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. వర్సిటీ ఉమెన్ స్టడీస్ - అరబిందో సొసైటీ సంయుక్తంగా ఉదయం 9.30 గంటలకు హ్యూమనిటీస్ బ్లాక్‌లో ఈ సదస్సును ప్రారంభిస్తారు. అరబిందోపరిషద్ అంశంపై ఈ కార్యక్రమం జరగనుంది. వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని, అరబిందో సొసైటీ ప్రతినిధులు ములుగు శ్రీనివాస్, రంగనాథన్, డీన్ కాత్యాయని పాల్గొంటారు.

సుపరిపాలన అందించే ప్రభుత్వాన్ని ఇవ్వాలని కోరా

- తిరుమలలో మాజీ మంత్రి జ్యోతుల నెహ్రూ



తిరుమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన అందించే ప్రభుత్వాన్ని ఇవ్వాలని శ్రీవారిని కోరుకున్నట్టు మాజీ మంత్రి జ్యోతుల నెహ్రూ తెలిపారు. తిరుమలేశుడిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని మొక్కుకున్నానని చెప్పారు. ఇటీవల తమ సొంతూరు ఇర్రిపాక గ్రామంలో 11 రోజులపాటు నిర్వహించిన మహా రుద్రాభిషేకం విజయవంతం కావడంతో స్వామి దర్శనానికి వచ్చామన్నారు.

వైసీపీ కార్యకర్తల్లా ఉద్యోగులు

- చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు టీడీపీ ఫిర్యాదు
- సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోలు



కుమ్మరనత్తం వీఆర్వో మునిరత్నానికి ఇటీవల వైసీపీ కండువా కప్పుతున్న మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు, మార్చి 19: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా పుంగనూరు నియోజకవర్గంలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, కొందరు వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్‌కు, కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ నాయకులు ఫిర్యాదులు పంపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని గెలిపించాలని కరపత్రాలతో పుంగనూరు మండలం బండ్లపల్లె పంచాయతీ నెల్లూరుపల్లెకి చెందిన బోయకొండ కాంట్రాక్టు ఉద్యోగి టి.శంకరప్ప ప్రచారం చేశారని పేర్కొన్నారు. అలాగే, గోపిశెట్టిపల్లెకు చెందిన కుమ్మరనత్తం గ్రామ రెవెన్యూ అధికారి మునిరత్నంకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైసీపీ కండువా కప్పిన ఫొటోతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొంతకాలం కిందట గోపిశెట్టిపల్లె గ్రామస్తులు, మహిళలను వైసీపీ నాయకులు బస్సుల్లో తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి ఇంటికి తీసుకెళ్లి ఆ పార్టీలో చేర్పించారు. అప్పుడే వీఆర్వో మునిరత్నం కూడా వెళ్లడంతో మంత్రి ఆయనకు కండువా కప్పారు. ఈ రెండు ఫొటోలతో తెలుగుదేశం పార్టీ నాయకులు ఫిర్యాదులు చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. వీరిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే ఫొటోలతో రైటింగ్ ప్యాడ్లపై ఈసీ సీరియస్

- కోడ్ ఉల్లంఘనపై వి.కోటలో కేసు నమోదు
- పలమనేరు ఎమ్మెల్యేకు షోకాజ్ నోటీసు



బాలుర ఉన్నత పాఠశాల వద్ద అధికారులతో తగాదా పడుతున్న వైసీపీ నేతలు

వి.కోట, మార్చి 19: పలమనేరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఫొటోలున్న రైటింగ్ ప్యాడ్లతో పదో తరగతి విద్యార్థులను పరీక్ష రాసేందుకు అనుమతించడంపై ఈసీ సీరియస్ అయింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో చర్యలకు ఉపక్రమించింది. వి.కోట పరీక్షా కేంద్రాలో సోమవారం రైటింగ్ ప్యాడ్లపై ఎమ్మెల్యే వెంకటేగౌడ ఫొటో ఉండటాన్ని గమనించి ఫ్లయింగ్ స్క్వాడ్ ఇచ్చిన నివేదిక మేరకు కోడ్ ఉల్లంఘన జరిగిందంటూ పలమనేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో మనోజ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ ఫొటో కలిగిన ప్యాడ్లను వినియోగించడం ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద గుర్తుతెలియని వ్యక్తులపై సీఐ లింగప్ప కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ప్యాడ్లను పంపిణీ చేశారా? లేదా పంపిణీ చేశాక కోడ్ అమల్లోకి వచ్చిందా? అన్న కోణంలో విచారణ జరుపుతున్నారు. పోలీసులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వద్దకు చేరుకుని ఈ ప్యాడ్లను ఎప్పుడు.. ఎవరు ఇచ్చారంటూ విచారణ చేపట్టారు. మరోవైపు ఎమ్మెల్యే వెంకటేగౌడకు ఈసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. 24 గంటల్లోపు దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

రైటింగ్ ప్యాడ్లను అనుమతించాలని వైసీపీ గొడవ

ఎమ్మెల్యే ఫొటోతో రైటింగ్ ప్యాడ్లను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించొద్దంటూ అధికారులు స్పష్టంచేశారు. దీంతో మంగళవారం ఉదయం రెవెన్యూ ఉద్యోగులు అన్ని పరీక్షా కేంద్రల వద్దకు చేరుకుని రైటింగ్ ప్యాడ్లను తనిఖీ చేసి లోపలకు పంపారు. వి.కోటలోని బాలుర ఉన్నత పాఠశాల కేంద్రం వద్ద ఎమ్మెల్యే ఫొటోలున్న రైటింగ్ ప్యాడ్లు అనుమతించేది లేదనడంతో కొందరు విద్యార్థులు ఫొటోను తొలగించి తీసుకెళ్లారు. అదేసమయానికి అక్కడకు చేరుకున్న కొందరు వైసీపీ నేతలు తమ ఎమ్మెల్యే ఫొటోలున్న రైటింగ్ ప్యాడ్లను ఎందుకు అనుమతించరంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో గందరగోళ వాతావరణం నెలకొంది. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నా.. సుమారు అరగంట పాటు కేంద్రం ముందు విద్యార్థుల రాకపోకలకు ఇబ్బంది పెట్టేలా అధికార పార్టీ నేతలు వ్యవహరించారు. అయినా, పోలీసులు వారిని సముదాయిస్తూ ఉన్నారేతప్ప పక్కకు తరలించే చర్యలు చేపట్టలేదు. పరీక్షా సమయం అవుతున్నా వైసీపీ నేతల వాగ్వాదం కొనసాగడంతో రెవెన్యూ అధికారులు వారిని బలవంతంగా పక్కకు పంపారు. కాగా, చాలా మంది గ్రామీణ విద్యార్థుల ప్యాడ్లను తీసేసుకోవడంతో.. తామెలా పరీక్షలు రాయాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు దుకాణాలకు వెళ్లి కొత్త ప్యాడ్లను తీసుకొచ్చి వారికి అందించారు. రైటింగ్ ప్యాడ్ల విషయంలో రాజకీయం చేస్తున్నారంటూ వైసీపీ సోషల్ మీడియా వేదికగా విపరీతంగా పోస్టులు వైరల్ అవుతున్నాయి. వీటిపైనా ఈసీ దృష్టి సారించాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి.

ఇది ఎన్నికల నిబంధనల ఉల్లంఘనే

పలమనేరు: విద్యార్థులకు ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ఫొటోలతో ఉన్న ప్యాడ్లు పంపిణీ చేయడం ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందని పలమనేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో మనోజ్‌రెడ్డి తెలిపారు. పలమనేరులోని కొన్ని పదో తరగతి పరీక్షా కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. నియోజకవర్గంలోని 22 పరీక్షా కేంద్రాలను అధికారులు.. తాను పట్టణంలోని నాలుగు కేంద్రాలను తనిఖీ చేశామన్నారు. మంగళవారం కూడా ఎమ్మెల్యే ఫొటోతో ఉన్న రైటింగ్ ప్యాడ్లను కొందరు తీసుకురాగా స్వాధీనం చేసుకొని, ప్రత్యామ్నాయంగా ప్యాడ్లను అందజేశామన్నారు. తన ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని వ్యక్తులపై వి.కోట పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. పోలీసుల విచారణలో ఈ ప్యాడ్లను ఎమ్మెల్యే పంపిణీ చేసినట్లు తేలితే దీనికైన ఖర్చు ను ప్రస్తుతం అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన ఎన్నిక ల వ్యయం కింద పరిగణించే అవకాశం లేకపోలేదన్నారు.ఈ ఘటనపై జిల్లా ఎన్నికల అధికారికి కూడా నివేదిక పంపామన్నా రు.ఆయన ఆదేశాల మేర కు తదుపరి చర్యలు ఉంటాయని చెప్పారు.



పరీక్షా కేంద్రం వద్ద ఆర్డీవో మనోజ్‌రెడ్డి తనిఖీలు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులను గెలిపించండి

- బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19: సామాజిక న్యాయం లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర రావు విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో ఆధిపత్య కులాలకు చెందినవారే సకల రంగాలను నాశనం చేశారని విమర్శించారు. మరోవైపు జనాభాలో 80శాతం ఉన్న బహుజనులు నేటికీ అధికారానికీ, అవకాశాలకూ దూరంగా ఉండటం అన్యాయమన్నారు. మోసపూరిత వాగ్దానాలతో బహుజనులు ఐక్యం కాకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ దశలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో కలిసి ప్రాంతీయ పార్టీ ఏర్పాటు చేయాలన్న యోచనలో ఉన్నట్టు వెల్లడించారు. ఇందుకు అవసరమైన మేధో సంపత్తిని, ప్రణాళికను రూపొందించే క్రమంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్టు చెప్పారు. కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్, రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ, జనసేనకు ప్రత్యామ్నాయంగా భావ సారూప్యత గల వ్యక్తులు, శక్తులతో కలిసి కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ దఫా కొత్త పార్టీ తరపున ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి పెట్టడం లేదన్నారు. అయితే, భావ సారూప్యత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థుల గెలుపునకు తోడ్పడతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖరాచార్య, జిల్లా కార్యదర్శి గణేష్, యువజన విభాగం అధ్యక్షుడు వినోద్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదనాచారి, నాయకులు మహేష్‌యాదవ్, పొలకల సుబ్రహ్మణ్యం, ద్వారక, శ్రీను పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కేశన శంకరరావు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.78 కోట్లు

తిరుమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.78 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.4.78 కోట్లు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 65,051 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,107 మంది తలనీలాలు సమర్పించారు.

విద్యార్థులకు దుస్తుల వితరణ



తిరుపతి అర్బన్, మార్చి 19: సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అక్షరయజ్ఞం స్టడీ సెంటర్స్ (పార్వతీపురం, గంగిరెడ్డికాలనీ)లోని 50మంది విద్యార్థులకు ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. సిర్ఢ్ సంస్థ కార్యదర్శి మరుపూరి శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనతా సేవా హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు కిరీటి హాజరయ్యారు. స్టడీ సెంటర్స్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి మధురిమ, కోఆర్డినేటర్ శైలజ, టీచర్స్ సుజాత, రేఖ తదితరులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులు సమర్థంగా పనిచేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 19: 'నోడల్ అధికారులు జిల్లా ఎన్నికల అధికారికి కళ్లు, చెవులు వంటివారు. అందువల్ల సమర్థంగా పనిచేయాలి'అని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. పీపీటీ తయారీతో సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. విధులను అంకితభావంతో నిర్వర్తించాలన్నారు. డీఆర్వో పెంచలకిషోర్, ఎలక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునికతను సంతరించుకున్న గ్రంథాలయాలు

జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విద్యాపీఠం వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19: గ్రంథాలయాలు ఆధునికతను సంతరించుకున్నాయని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ వీసీ కృష్ణమూర్తి అన్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రకు చెందిన 75 మంది జాతీయ గ్రంథాలయాల నిర్వాహకులకు ఎస్వీయూ సెనెట్ హాల్లో మంగళవారం పునశ్చరణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈనెల 23వ తేదీ దాకా సాగే తరగతులను విద్యాపీఠం వీసీ ప్రారంభించి, ప్రసంగించారు. నేషనల్ మిషన్ ఆన్ లైబ్రరీస్ (ఎన్ఎంఎల్), రాజారామ్ మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ సంయుక్తంగా గ్రంథాలయాల ఉన్నతి కోసం ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగానే ఈ తరగతులు అన్నారు. ఎన్ఎంఎల్ అదనపు డైరెక్టర్ జనరల్ బీవీ శర్మ మాట్లాడుతూ.. దేశంలోని పబ్లిక్ లైబ్రరీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని చెప్పారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ హుస్సేన్ మాట్లాడుతూ.. యువత గ్రంథాలయాలకు వెళ్లేలా ప్రోత్సహించాలన్నారు. లైబ్రరీ ప్రాజెక్టు ఆఫీసర్ దిపంజన్ చటర్జీ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గ్రంథాలయాల అభివృద్ధిపై దృష్టి సారించామన్నారు. ఎస్వీయూ ప్రధాన గ్రంథాలయాధికారి సురేంద్రబాబు, వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ పీసీ వెంకటేశ్వర్లు, పలు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీలో బీవీ శర్మ

తిరుపతి(రూరల్), మార్చి 19: జాతీయ సంస్కృత వర్సిటీని మంగళవారం ఎన్ఎంఎల్ అదనపు డైరెక్టర్ జనరల్ బీవీ శర్మ సందర్శించారు. వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అకడమిక్ డీన్ సి.రాఘవన్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ స్వాగతం పలికారు. శర్మ వర్సిటీలోని లైబ్రరీని సందర్శించారు. భారతీయ సంస్కృతి, ప్రాచీన ఆంత్రోపాలజీ విషయాలను బలోపేతం చేసేందుకు అధ్యాపకులతో చర్చాగోష్ఠి నిర్వహించారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ గిరినాయుడు, ప్రొఫెసర్ సత్యనారాయణాచార్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఎస్పీ



సెబ్ అధికాలతో సమావేశమైన ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి క్రైం, మార్చి 19: ఎన్నికల నియామళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ హెచ్చరించారు. పోలీసు అతిథి గృహంలో మంగళవారం ఎస్ఈబీ అధికారులకు ఎన్నికల నియమావళి, కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. సారా, గంజాయి, అక్రమ మద్యం నిల్వలను గుర్తించి సీజ్ చేయాలని ఆదేశించారు. అందరూ సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో ఎలాంటి చెడ్డపేరు రాకుండా పనిచేయాలని కోరారు. ఎక్కడైనా అక్రమ మద్యం, ఇతర నిషేధిత వస్తువులు కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని అన్నారు. సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర, ఎన్‌ఫోర్సుమెంటు సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అవకతవకలు అరికట్టండి

ఆర్డీవోకి పులివర్తి సుధారెడ్డి వినతి



ఆర్డీవోతో సమావేశమైన పులివర్తి సుధారెడ్డి, ఇతర నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 19: ఓటర్ల జాబితాలో అవకతవకలు అరికట్టాలని ఆర్డీవో నిశాంత్‌రెడ్డికి టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. కనీసం పత్రికా ప్రకటన కూడా లేకుండా, ప్రతిపక్షాలకు తెలియజేయకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా పోలింగ్ బూత్‌లను 325 నుంచి 395కు పెంచారన్నారు. ఓటర్లలో గందరగోళం సృష్టించేందుకు పోలింగ్ బూత్‌ల సంఖ్యను పెంచారని ఆరోపించారు. పోలింగ్ బూత్‌లను మార్చాల్సివస్తే నిబంధనల ప్రకారం 200 నుంచి 400 మీటర్ల దూరం లోపల ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. అయితే 43 పోలింగ్ బూత్‌లను మూడు నుంచి ఏకంగా 10కిలోమీటర్ల దూరంలోకి మార్చేశారని వాపోయారు. మరోవైపు ఓ కుటుంబంలో నాలుగు ఓట్లుంటే ఒక్కో ఓటును ఒక్కో బూత్‌కు కేటాయించారని చెప్పారు. పది ఓట్లుంటే 10 బూత్‌లకు మార్చేశారని వివరించారు. వీటిని పరిశీలించాలని కోరారు.

అలిపిరి నడక మార్గంలో జెర్రిపోతు



తిరుమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడకమార్గంలో మంగళవారం సుమారు ఆరడుగుల పొడవైన జెర్రిపోతు పాము పట్టుబడింది. దివ్యారామానికి సమీపంలోని నేపాలి సెక్యూరిటీ షెడ్‌లోకి ఈ పాము ప్రవేశించింది. గుర్తించిన సిబ్బంది భయంతో బయటకి పరుగులు తీశారు. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని ఆ పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. పట్టుబడిన పామును దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.

ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో రాజకీయ ప్రకటనలు నిషేధం

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 19: 'ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన వాణిజ్య స్థలాల్లో ఎలాంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించరాదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలి' అని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం సీఈవో కార్యాలయం నుంచి అన్ని జిల్లాల అధికారులతో ఎన్నికలకోడ్ అమలుపై సమీక్షించారు. ప్రస్తుతం హైవేలు, మెయిన్ రోడ్ల పక్కన ఉన్న హోర్డింగ్‌లనుకూడా సమానప్రతిపాదికన అన్ని రాజకీయ పార్టీలకు కేటాయించాలన్నారు. నూతన అనుమతులను ఇవ్వరాదని సూచించారు. కలెక్టరేట్‌నుంచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మీశ, డీఆర్వో పెంచలకిషోర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

తిరుపతిని గంజాయివనం చేశారు

నేను వైసీపీ కోవర్టును కాదు.. నాన్ లోకల్ అంతకంటే కాదు! - జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు



మీడియాతో మాట్లాడుతున్న ఆరణి

తిరుపతి అర్బన్, మార్చి 19: 'స్థానిక ఎమ్మెల్యే, ఆయన కుమారుడు పుణ్యక్షేత్రమైన తిరుపతిని గంజాయివనం చేశారు. ప్రజలు ఆలోచించాలి' అని తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరంలోని ఎన్జీవో కాలనీలో పార్టీ ఎన్నికల కార్యాలయం ప్రారంభించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాను వైసీపీ కోవర్టునని, నాన్ లోకల్ అని కొందరు పనిగట్టుకుని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను వైసీపీ కోవర్టును కాదన్నారు. నాన్ లోకల్ అంతకంటే కాదన్నారు. 2009 నుంచీ తనకు పద్మావతీపురంలో సొంత ఇల్లుందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలన అవినీతిమయమని ఆరోపించారు. పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి జనసేనలో చేరానన్నారు. వైసీపీ హయాంలో తిరుపతి ఎమ్మెల్యే, ఆయన కుమారుడు చేసిన అక్రమాల గురించి అందరికీ తెలుసునన్నారు. తిరుపతి ప్రజలకు సేవ చేసేందుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వడం పట్ల సంతోషంగా ఉందన్నారు.తిరుపతి ఎన్జీవో కాలనీలో కార్యాలయంతో పాటు ఇల్లు కూడా తీసుకున్నానని, 24 గంటలూ ప్రజలకు అందుబాటులోనే వుంటానన్నారు.పవన్ కల్యాణ్ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. జనసేన నుంచి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రాజేష్ యాదవ్, ముక్కు సత్యవంతుడు, రాజేష్ ఆచారి, కీర్తన, ఆకుల వనజ, కొన్ని డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు హాజరయ్యారు.

స్థానిక అభ్యర్థికే మా మద్దతు

అధిష్ఠానాలు పునరాలోచించాలని టీడీపీ ముఖ్య నాయకుల తీర్మానం



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తిరుపతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి అసెంబ్లీ సీటును పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. అయితే అభ్యర్థి స్థానికుడై ఉండాలి. ఆ దిశగా పార్టీ అధిష్ఠానాలు పునరాలోచించాలి' అని టీడీపీ ముఖ్య నాయకులు తీర్మానం చేశారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్లో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. 'తెలుగుదేశం పార్టీ పురుడు పోసుకున్న తిరుపతిలో నాలుగు దశాబ్దాల తర్వాత సైకిల్ గుర్తు లేకుండా ఎన్నికలకు వెళ్లడం బాధగా ఉంది. పదేళ్లుగా పార్టీ కేడర్‌ను కాపాడుకుంటూ వస్తున్నాం. అయినా పొత్తు ధర్మానికి అందరూ కట్టుబడి ఉండాలి కాబట్టి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధినేతలు తీసుకున్న నిర్ణయమే శిరోధార్యం. అయితే స్థానిక రాజకీయ పరిణామాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జనసేనలో చేరిన వారం రోజులకు తిరుపతి అభ్యర్థిగా తెరపైకి రావడం టీడీపీ శ్రేణులే కాకుండా, బీజేపీ నాయకులు కూడా అసంతృప్తిలో ఉన్నారు. ముఖ్యంగా జనసేన నాయకులు కూడా ఆయనకు సహకరించే పరిస్థితి లేదు. ఆరణిపై తీవ్రంగా ఉన్న అసమ్మతిని అధిష్ఠానం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది' అని టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు.తిరుపతిని భ్రష్టుపట్టించిన అభినయ్ రెడ్డిని ఓడించడమే అందరి లక్ష్యం. అవసరమైతే జనసేన నుంచి పోటీచేయమన్నా తాను సిద్ధమేనని సుగుణమ్మ వెల్లడించారు. నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి. ఆర్సీ మునికృష్ణ. పులుగోరు మురళీకృష్ణారెడ్డి, ఊకా విజయ్ కుమార్, జేబీ శ్రీనివాస్, శ్రీధర్ వర్మ, చినబాబు, మహేష్ యాదవ్, రవినాయుడు, ఊట్ల సురేంద్ర నాయుడు, కంకణాల రజనీకాంత్, శ్రీహరి నాయుడు, నూరా సుధాకర్ రెడ్డి, విజయలక్ష్మి, కృష్ణ యాదవ్, రుద్రకోటి సదాశివం, పుష్పావతి, అంబూరి సింధూజ, కుమారమ్మ, శాంతమ్మ, వినుకొండ సుబ్రహ్మణ్యం, ఆనంద యాదవ్, విశ్వనాథం. లక్ష్మీపతి నాయుడు, ఆముదాల తులసీరాం, ఆర్సీ శ్రీనివాసులు, శాంబోళ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తొలగిన జగన్ చిత్రాలు



ఈహెచ్ఎస్ ఓపీ ముందు తొలగించిన ఫ్లెక్సీలు - రుయా ఓపీ గది ముందు, అత్యవసర విభాగం ముందు తొలగించిన లైటింగ్ బోర్డులు

తిరుపతి(వైద్యం), మార్చి 19: రుయా స్పత్రి, స్విమ్స్ ఆస్పత్రుల పరిధిలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ సీఎం జగన్, ఇతర నేతలతో కూడిన బోర్డులు, పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీలను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి రెండ్రోజులు అవుతున్నా ఆస్పత్రుల ఆవరణలో ఎటు చూసినా సీఎం, ఇతర నేతల చిత్రపటాలు, ప్రచార బోర్డులు అలాగే దర్శనమిస్తున్న విషయంపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'ఆస్పత్రులకు ఎన్నికల కోడ్ వర్తించదా?' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన వైద్యాధికారులు వెంటనే ఆస్పత్రి ఆవరణలోని అన్ని బోర్డులను, ఫ్లెక్సీలను, నేతల ఫొటోలతో కూడిన గోడ గడియారాలను తొలగించారు. ఆస్పత్రి పరిసరాల్లో ఎక్కడా ప్రజానేతలకు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీలు, ఫొటోలు లేకుండా చూడాలని లేదంటే చర్యలు తప్పవని సిబ్బందికి సూపరింటెండెంట్ రవిప్రభు ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

టీడీపీ బీసీ సెల్ నాయకుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ బీసీ సెల్ నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19: తమ నాయకుడిపై పుత్తూరులో జరిగిన దాడిని టీడీపీ బీసీ సెల్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. పుత్తూరులో సోమవారం ఓ గుంతలో పడిపోయిన కుక్క పిల్లను బయటకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న బీసీ సెల్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డిపై తమ నిర్మాణాలను ఫొటో తీస్తున్నావంటూ వైసీపీ నాయకులు హరి, సునీల్ దాడి చేశారని తెలిపారు. ఈ దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, నాయకులు నాగూరు శ్రీనివాసులు, మునిరత్నంరెడ్డి, హేమలత, వెంకటసుబ్బమ్మ, గోవిందరాజులు, ముంతాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

మాపై అదనపు పనిభారం

డీఎంహెచ్‌వోకి ఆశా వర్కర్ల మొర

వైద్య ఆరోగ్యశాఖ గ్రీవెన్స్ డేకి 33 అర్జీలు



ఉద్యోగుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి

తిరుపతి (వైద్యం), మార్చి 19: పీహెచ్‌సీల్లో తమపై అదనపు పనిభారం మోపుతున్నారని డీఎంహెచ్‌వో శ్రీహరికి ఆశా వర్కర్లు మొరపెట్టుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను సమస్యలను డీఎంహెచ్‌వో దృష్టికి ఆశా వర్కర్లు తీసుకొచ్చారు. స్పందించిన ఆయన కొందరు మెడికల్ ఆఫీసర్లతో మాట్లాడి ఆశాలపై అదనపు పనిభారం వేయొద్దని ఆదేశాలిచ్చారు. అలాగే రెండు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నామని కొందరు ఉద్యోగులు, పీహెచ్‌సీల్లో తమ క్యాడర్‌కు సంబంధించిన పోస్టు వివరాలు లేవని మరికొందరు, పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు వినతులు అందించారు. ఇలా మొత్తం 33 అర్జీలు అందాయి. వీటిల్లో అనేక సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కారం చేశారు. మిలిగిన అర్జీలను హెల్త్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని ఆయన ఉద్యోగులకు హామీ ఇచ్చారు. డీపీఎంవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దొంగను పట్టిచ్చినా న్యాయం జరగలేదు

బాధితుడి ఆవేదన



ఈనెల ఏడో తేదీ సాయంత్రం అలిపిరి స్టేషన్‌లో దొంగ అప్పగింత

తిరుపతి క్రైం, మార్చి 19: దొంగను పట్టిచ్చినా తమకు న్యాయం జరగలేదని ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. తొండవాడ గ్రామానికి చెందిన కె.ఉమేష్.. భూపాల్ హౌసింగ్ కాలనీలోని బాలాజీ హాస్పిటాలిటీ సర్వీసులో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నాడు. ఈనెల ఆరో తేదీన ఉమేష్ నైట్ డ్యూటీలో ఉండగా, రాత్రి 11.30 గంటలకు వాష్ రూమ్‌కి వెళ్లాడు. తిరిగొచ్చేలోగా ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉమేష్ మొబైల్ ఫోన్, ద్విచక్రవాహనం తాళాలు ఎత్తుకెళ్లాడు. తర్వాత పార్కింగ్‌లో ఉన్న ద్విచక్ర వాహనాన్నీ తీసుకెళ్లిపోయాడు. ఈ ఘటనపై అదే రోజు రాత్రి బాధితుడు డయల్ 100కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేశాడు. బ్లూకోల్ట్స్ పోలీసులు కూడా సంఘటనా స్థలానికి చేరుకుని, ఆరా తీశారు. మరుసటి రోజు వచ్చి ఫిర్యాదు చేయాలని చెప్పి వెళ్లిపోయారు. తర్వాత ఏడో తేదీన అలిపిరి పోలీసు స్టేషన్‌కు వెళ్లిన బాధితుడు ఎస్ఐకి ఫిర్యాదు చేశాడు. అలాగే సీసీ కెమెరాల ద్వారా సేకరించిన నిందితుడి ఫొటోను వాట్సాప్ ద్వారా ఎస్ఐకి పంపారు. ఆ తర్వాత ఉమేష్, అతడి స్నేహితులు కలిసి చంద్రగిరి మండలం తొండవాడ గ్రామానికి చెందిన జగనన్న కాలనీ వద్ద ఏడో తేదీ సాయంత్రం దొంగను పట్టుకున్నారు. ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని, మొబైల్ ఫోన్ ఆచూకీ లభించక పోవడంతో ఆ దొంగను అలిపిరి స్టేషన్ స్టేషన్‌కి తీసుకొచ్చి, రైటర్‌కి అప్పజెప్పారు. విచారణలో మాల్యాద్రి ప్రకాశం జిల్లా కందుకూరు మండలం ముప్పాల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అయితే నిందితుడిని మరుసటి రోజు స్టేషన్‌కి రావాలని చెప్పి. విడిచిపెట్టారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. అప్పటినుంచి స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దీనిపై అలిపిరి సీఐ రామచంద్రారెడ్డిని వివరణ కోరగా.. ఈనెల 8న శివరాత్రి పర్వదినం రోజున దొంగను తీసుకొచ్చి అప్పజెప్పిన మాట వాస్తవమేనన్నారు. అయితే నిందితుడు మద్యం మత్తులో ఉండటంతో ఇంటికి పంపామన్నారు. దీనిపై విచారించి ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్‌ని బాధితుడికి అప్పజెప్పామని సీఐ చెప్పారు.



ఆర్ఎన్ రవి - గోరటి వెంకన్న - మోహన్‌లాల్ - ముఖేష్ రిషి - అయ్యప్ప శర్మ

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు



కుటుంబీకులతో రాజీవ్ కనకాల, సుమ

తిరుమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, టీడీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి దంపతులు, తెలంగాణ ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, బీజేపీ ఎంపీ ప్రతాప్‌రావు పాటిల్, ప్రముఖ జానపద గాయకుడు గోరటి వెంకన్న, మళయాళ సినీనటుడు మోహన్‌లాల్, నటులు ముఖేష్ రిషి, అయ్యప్ప శర్మ, రాజీవ్ కనకాల, ఆయన సతీమణి సుమ, కుమారుడు హీరో రోషన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

పవన్ అనుమతి లేనిదే జనసేన కమిటీలను మార్చం



వార్డు కమిటీ అధ్యక్షులతో సమావేశమైన కిరణ్ రాయల్

తిరుపతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వార్డు కమిటీలను అధినేత పవన్ కల్యాణ్ అనుమతి లేనిదే మార్చేది లేదని నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ రాయల్ స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం తన నివాసంలో కమిటీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. తమ స్థానంలో కొత్తవారిని నియమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పలువురు వార్డు కమిటీల అధ్యక్షులు ఆందోళన వ్యక్తం చేశారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు తమ వార్డుల్లో పర్యటిస్తూ పార్టీ కార్యకలాపాలు సాగించేందుకు యత్నిస్తున్నారని చెప్పారు. అలాగే నియోజకవర్గ కమిటీలోనూ కొత్తవారిని చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై కిరణ్ రాయల్ మాట్లాడుతూ.. తిరుపతి నియోజకవర్గ, వార్డు కమిటీలను నియమించింది అధినేత అని, ఆయన అనుమతి లేకుండా వాటిని మార్చడానికి అంగీకరించబోమన్నారు. నగరాధ్యక్షుడు రాజారెడ్డి, నాయకులు బాబ్జి, హేమకుమార్, మునస్వామి, రాజేష్ ఆచారి, రమేష్ నాయుడు, వినోద్, హిమవంత్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ వీటికి వర్తించదా?





స్విమ్స్ ప్రాంగణంలో.., రామానుజపల్లెలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలపై కనిపిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పేరు

తిరుపతి(వైద్యం/రూరల్), మార్చి 19: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి మూడ్రోజులవుతున్నా స్విమ్స్ ఆస్పత్రి పరిసరాల్లో మంగళవారం నాటికి కూడా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరుతో తుడా నిధులతో వేయించిన దాదాపు 50 సిమెంటు బెంచీలు ఇప్పటికీ అలాగే దర్శనమిస్తున్నాయి. అలాగే తిరుపతి రూరల్ మండలంలోని రామానుజపల్లెలోనూ రోడ్డు పక్కన ఇటువంటి సిమెంటు బెంచీలే ఉన్నాయి. ఇవి ఇటు రోగులు, అటు జనానికి ఉపయోగమే అయినా వీటిపై భారీ అక్షరాలతో ఆయన పేరు రాసి ఉంది. దాంతో వీటిని చూసిన వారంతా వీటికి ఎన్నికల కోడ్‌కు వర్తించదా? అని చర్చించుకుంటున్నారు.

నారా భువనేశ్వరి పర్యటనను
విజయవంతం చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 19: వాకాడు మండలంలోని తిరుమారులో ఈ నెల 22వ తేదీన జరుగనున్న నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడిని అక్రమంగా అరెస్ట్ చేసిన సమయంలో ప్రాణాలు కోల్పోయిన టీడీపీ కుటుంబ సభ్యులను భువనేశ్వరి కలసి భరోసా కల్పిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా తిరుమూరు గ్రామానికి ఈనెల 22న వస్తున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, గణపర్తి కిషోర్‌నాయుడు తదితతరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి సమష్టి పోరాటం: నెలవల

పెళ్లకూరు, మార్చి 19: టీడీపీ విజయానికి సమష్టిగా పోరాటం చేద్దామని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని శిరసనంబేడు గ్రామంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్ని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, రామచంద్రారెడ్డి, హరిబాబురెడ్డి, వేలూరు కల్యాణ్‌రెడ్డి, నేలవల్లి సిద్ధులయ్య నాయుడు, దార్ల రాజేంద్ర, సుధాకర్‌రెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

టీడీపీ నేతపై దాడి ఘటనలో
మున్సిపల్ చైర్మన్‌పై కేసు నమోదు
బాధితుడిపైనా అట్రాసిటీ కేసు

పుత్తూరు అర్బన్, మార్చి 19: టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డిపై జరిగిన దాడి సంఘటనలో పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి, ఆయన అనుచరుడు సునీల్‌పై సోమవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మున్సిపల్ చైర్మన్ హరి అనుచరుడు సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాధితుడు షణ్ముగరెడ్డి, నవీన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేశారు. పట్టణంలోని చింతలగుంట వద్ద సోమవారం సాయంత్రం జరిగిన సంఘటనకు సంబంధించిన ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఇలాగైతే జీరో వయెలెన్స్ ఎన్నికలు సాధ్యమేనా?

పట్టణంలో సోమవారం సాయంత్రం నుంచి జరిగిన పరిణామాల పట్ల పట్టణవాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరుపార్టీల నాయకులు ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకునే క్రమంలో పోలీస్‌స్టేషన్ వద్ద తలెత్తిన ఉద్రిక్త పరిస్థితులు, వాగ్వాదాలతో సమీప ప్రాంతం దద్దరిల్లింది. ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నంలో భాగంగా పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. ఈ క్రమంలో స్టేషన్‌కు ఆనుకుని ఉన్న మార్కెట్ వద్ద కొనుగోళ్ల కోసం వచ్చిన సామాన్యులకు కూడా లాఠీ దెబ్బలు తగలడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు పోలీసు అధికారులు స్టేషన్‌లో ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు తీసుకుని విచారిస్తుండగా బయట ఉన్న సిబ్బంది యధాలాపంగా విధులు నిర్వహించడంతోనే పరిస్థితి ఉద్రిక్తంగా మారేందుకు ఆస్కారం ఏర్పడిందనే మాటలు వినబడుతున్నాయి. ఒకవైపు కేంద్ర ఎన్నికల కమిషన్ జీరో వయెలెన్స్ పేరుతో ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తుండగా రాజకీయ నాయకుల స్వార్థ రాజకీయ ప్రయోజనాల నడుమ పుత్తూరు ప్రశాంతతకు విఘాతం తలెత్తుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకుందాం



ఓటు హక్కుపై మున్సిపల్ సిబ్బంది ర్యాలీ

పుత్తూరు అర్బన్, మార్చి 19: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవడం ద్వారా మెరుగైన సమాజం ఆవిష్కృతమవుతుందని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఓటు హక్కును వినియోగించుకోవడంపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మెప్మా, వెలుగు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పంగోణోత్తర ఉత్సవం



నారాయణవనం, మార్చి 19: మండల కేంద్రంలోని పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పంగోణోత్తర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నిత్య కైంకర్యాల అనంతరం అమ్మవారికి ప్రత్యేక తిరుమంజనం జరిపారు. సాయంత్రం ఉత్సవర్లను అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆలయ అంతర ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం ఊంజల మండపంలో ఊయలపై కొలువదీర్చి, ఊయల సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ బీసీ సెల్ నాయకుడిపై దారుణం



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ బీసీ సెల్ నాయకులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మార్చి 19: టీడీపీ బీసీ సెల్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డిపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడడాన్ని బీసీ సెల్ తీవ్రంగా ఖండించింది. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం టీడీపీ బీసీ సెల్ నాయకులు మీడియాతో మాట్లాడారు. పుత్తూరులో గుంతలో పడిపోయిన కుక్క పిల్లను బయటకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న షణ్ముగరెడ్డిపై తమ నిర్మాణాలను ఫొటో తీస్తున్నావంటూ పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి, ఆయన అనుచరుడు సునీల్ దాడి చేయడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, నాయకులు నాగూరు శ్రీనివాసులు, మునిరత్నం రెడ్డి, హేమలత, వెంకటసుబ్బమ్మ, గోవిందరాజులు, ముంతాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

దివ్యాంగులకు
ఉచితంగా కృత్రిమ చేతులు

గూడూరు అర్బన్, మార్చి 19: మంగళగిరిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మే నెల 19నుంచి 26వ తేదీ వరకు చెయ్యి లేని దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులు అమర్చనున్నట్లు రోటరీక్లబ్ సభ్యుడు మయూరి శ్యామ్‌యాదవ్ మంగళవారం తెలిపారు. అవసరమైన దివ్యాంగులు 7207403150 హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రెండు వర్గాల ఘర్షణ
కేసుల నమోదు

కోట, మార్చి 19: మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెంలో పొలాల వద్ద సాగునీటి విషయమై రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. కావలి పోలయ్యపై అదే గ్రామానికి చెందిన కోటేశ్వరరావు, శ్రీనివాసులు, వెంకటకృష్ణయ్య దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఇరువురి కేసులు నమోదుచేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

అందని గంగ... ఎండుతున్న వరి

నీరివ్వలేమని చేతులెత్తేసిన అధికారులు ● గుండెలు బాదుకుంటున్న అన్నదాతలు



సిద్ధమ్మకండ్రిగ వద్ద ఎండుముఖం పట్టిన వరిపైరు

కోట, మార్చి 19: కోట మండలంలోని తెలుగుగంగ నీరు అందక వరి పంటలు ఎండిపోతున్నాయి. మండలంలో మెట్ట పంచాయతీలైన కేశవరం, మద్దాలి, చిట్టేడుతో పాటు డెల్టా పంచాయతీలైన అల్లంపాడు, పుచ్చలపల్లి, ఉత్తమ నెల్లూరు ప్రాంతాల్లో 4,500 ఎకరాల్లో రైతులు సాగు చేసిన వరి పైర్లు వెన్ను, పొట్టదశలో ఉన్నాయి. మరో రెండు తడులు నీరందిస్తే దిగుబడి చేతికందుతుంది. అయితే చెరువులు, గుంటలు ఎండిపోయాయి. ఇదే సమయంలో తెలుగుగంగ నీరివ్వలేమంటూ అధికారులు చేతులెత్తేయడంతో అన్నదాతలు గుండెలు బాదుకుంటున్నారు. రైతులు ఈ ఏడాది ముందుగానే వరినార్లు పోసుకున్నప్పటికీ గత ఏడాది చివర్లో సంభవించిన మిచౌంగ్ తుఫాన్ వల్ల నారు మడులన్నీ వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. అదును అయిపోయినప్పటికీ తిరిగి నారుమడులు పోసుకోవాలని, చివరిలో సాగునీరు తక్కువయితే కండలేరు నుంచి గంగను తెప్పించి పంటలు కాపాడుతామని అధికార పార్టీ నేతలు భరోసా ఇచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఆ నేతలను నమ్మి రైతులు పెద్ద జిలకర్ల, నెల్లూరు జిలకర్లను వరిసాగు చేశారు. పంట చివర దశలో చెరువుల్లో చుక్కనీరు లేకపోవడం తెలుగు గంగ అధికారులకు విజ్ఞప్తి చేశారు. అయితే నీరివ్వలేమంటూ అధికారులు స్పష్టం చేయడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. పక్కనే ఉన్న చిట్టమూరు మండలంలోని మల్లాం ప్రాంతానికి గంగనీరు ఇస్తున్న అధికారులు కోట మండలంపై వివక్ష చూపుతున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కండలేరు డ్యామ్‌లో 275 ఎంసీఎఫ్‌టీ డెడ్ స్టోరేజీలో నీళ్లు ఉన్నాయని, కేవలం 5వ బ్రాంచ్ కెనాల్ ద్వారా 150 క్యూసెక్కులు మాత్రమే కోట మండలానికి ఇవ్వాలన్న లక్ష్యంతో నీరు వదిలామని, అవి చిల్లకూరు మండల పరిధిలోకి సమీపం వరకే వచ్చాయని, దిగువభాగాన ఉన్న కోట మండలంలోని స్వర్ణముఖి, చల్లకాలువ మీదుగా గంగనీటిని పంపి పంటలను కాపాడాలనుకున్నప్పటికీ సరిపోలేదని అధికారులు చెబుతున్నారు. కోట మండలానికి తెలుగుగంగ నీటిని ఇవ్వలేమని ఆశాఖ ఈఈ శ్రీనివాసరావు తేల్చిచెప్పడంతో అన్నదాతలు గుండెలు బాదుకుంటున్నారు.

టీడీపీతోనే బలహీన వర్గాల అభ్యున్నతి: విజయశ్రీ



చిలమత్తూరులో ప్రచారం నిర్వహిస్తున్న విజయశ్రీ

నాయుడుపేట టౌన్, మార్చి 19: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమవుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నరు. మండలంలోని చిలమత్తూరు గ్రామంలో మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ రాబోవు ఎన్నికల్లో టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. విజయశ్రీ మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు లభించాలంటే టీడీపీకి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరామ్ ప్రసాద్, చెంచయ్య, సుబ్బరాయులు, జనార్ధన్‌రెడ్డి, చక్రపాణి, చంద్రశేఖర్‌రెడ్డి, బాబు, కిష్టయ్య, రాజేంద్ర, అవధానం సుధీర్, మధుసూదన్‌నాయుడు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాశిం సంధ్యారాణి

గూడూరు, మార్చి 19: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక కర్ణాలవీధిలో శంఖారావం, సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు అమాతం పెరిగిపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ఇంటి పన్నులు, విద్యుత్, ఆర్టీసీ చార్జీలను వైసీపీ ప్రభుత్వం పెంచేసిందన్నారు. ప్రజారంజక పాలన అందించాలంటే చంద్రబాబునాయుడుకే సాధ్యమవుతుందన్నారు. రానున్న ఎన్నికలలో ఉమ్మడి ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలన్నారు.

చిత్తూరు పార్లమెంటు టీడీపీ
అధ్యక్షుడిగా సీఆర్‌రాజన్



తిరుపతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడిగా తిరుచానూరు మాజీ సర్పంచ్ సీఆర్ రాజన్ నియమితులయ్యారు.ఇప్పటి వరకూ ఆ పదవిలో వున్న పులివర్తి నానీ చంద్రగిరి నియోజకవర్గ ఇంఛార్జిగానూ, టీడీపీ అభ్యర్థిగానూ ఎన్నికల్లో బిజీగా వుండడంతో ఆయన స్థానంలో రాజన్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించారు. తిరుచానూరు ప్రాంతంలో ప్రాబల్యం కలిగిన రాజన్ వన్నియకుల క్షత్రియ సంఘం రాష్ట్ర కోశాధికారిగా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా పని చేశారు. ఈ ఎన్నికల్లో చిత్తూరు అసెంబ్లీ టికెట్ ఆశించారు. దీనికోసం ఆయన చిత్తూరుకు మకాం మార్చి కొంతకాలం అక్కడే పార్టీలో చురుగ్గా పనిచేశారు. అయితే పలు సమీకరణల కారణంగా ఆయనకు టికెట్ దక్కలేదు. దానివల్ల ఆయనకు పార్టీలో సముచిత గుర్తింపు, గౌరవం కల్పించడంతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో గణనీయంగా వున్న వన్నెకుల క్షత్రియ సామాజికవర్గాన్ని సంతృప్తి పరిచేందుకు రాజన్‌కు కీలక పదవి కట్టబెట్టారు. కుప్పం మొదలుకుని చిత్తూరు, చంద్రగిరి, నగరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో వన్యకుల క్షత్రియులు అధికంగా వున్నారు. ఆ సామాజికవర్గంలో ప్రాబల్యం కలిగిన రాజన్‌కు చిత్తూరు పార్లమెంటు అధ్యక్ష పదవి కేటాయించడం టీడీపీకి గణనీయంగా లాభించనుంది. చంద్రగిరి నియోజకవర్గంలో ఈసారి ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని హోరాహోరీగా పోరాడుతున్న పులివర్తి నానీ వ్యూహాత్మకంగా రాజన్‌కు ఈ పదవి దక్కేలా అధినేత చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం.చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షులుగా ఇ.శ్రీనివాసులు (చిత్తూరు) పీసీ మణి (రామచంద్రాపురం), వాణిజ్యవిభాగం ఉపాధ్యక్షుడిగా ఎస్‌ఏ ప్రసాద్ రెడ్డి, ఎం.గోపి (చిత్తూరు), సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షుడిగా జి.రమేష్, టీచర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా ఎస్.నరసింహులు (చిత్తూరు) నియమితులయ్యారు.

గడ్డివామి దగ్ధం

కోట, మార్చి 19: మండల పరిధిలోని రాఘవాపురంలో మంగళవారం శ్రీరామ్ రమణయ్యకు చెందిన గడ్డివామి మంగళవారం అగ్నికి ఆహుతైంది. గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివామిపై సిగిరెట్ పీకలు వేయడంతో ఒక్కసారిగా మంటలు ఎగిశాయి. కోట నుంచి ఫైర్ ఇంజన్ వెళ్లి మంటలను ఆర్పివేసింది.

వీధిలో దుకాణాల నిర్మాణం
అడ్డుకున్న అధికారులు



వీధిలో దుకాణాల కోసం వేసిన పునాది

కోట, మార్చి 19: మండల పరిధిలోని చెందోడు పంచాయతీలో ఓ వ్యక్తి వీధిని ఆక్రమించి దుకాణాలు నిర్మించేందుకు ఉపక్రమించాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



తిన్నెలపూడి పోలింగ్ కేంద్రంలో ఎంపీడీవో, ఎస్ఐ

కోట, మార్చి 19: మండల పరిధిలోని వెంకన్నపాళెం, తిన్నెలపూడి, కొక్కుపాడు, కొత్తపట్నం గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీవో శంకరయ్య, ఎస్ఐ నాగబాబు పరిశీలించారు. ఎన్నికల నిబంధనలపై ఓటర్లకు అవగాహన కల్పించారు.

రైల్వేగేటు మూసివేత

గూడూరు, మార్చి 19: గూడూరు ఒకటో, రెండో పట్టణాలకు రాకపోకలు సాగించే ప్రాంతంలో తిరుపతి మార్గంలో ఉన్న రైల్వే గేటును కారణంగా మూసివేశారు. ఈ గేటు వద్ద ట్రాక్ మరమ్మతులు, రోడ్డు అభివృద్ధి పనులను సోమవారం నుంచి చేపట్టారు. ఈనెల 23 వరకు పనులు కొనసాగుతాయని, అప్పటి వరకు ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలని రైల్వే అధికారులు సూచించారు.

రవాణాశాఖ చెక్‌పోస్టు మూసివేతతో
ఆన్‌లైన్ సెంటర్లకు పండగ

తడ, మార్చి 19: రవాణాశాఖ చెక్‌పోస్టు మూతపడటంతో కామన్ సర్వీస్ సెంటర్ల(ఆన్‌లైన్)కు పండగలా మారింది. భీములవారిపాళెంలో రవాణాశాఖ చెక్‌పోస్టు గత శనివారం సాయంత్రం నుంచి మూసివేసిన విషయం తెలిసిందే. పర్మిట్లు వంటి సర్వీసులను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చింది. అయినా కొంతమంది చెక్‌పోస్టు వద్దకు వచ్చి అక్కడ కార్యాలయంలో నగదు చెల్లించి సేవలను పొందేవారు. శనివారం సాయంత్రం నుంచి చెక్‌పోస్టు మూసివేయడంతో పాటు అప్పటికప్పుడు అక్కడే కామన్ సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేశారు. కొంతమంది మొబైల్ సర్వీస్ సెంటర్లను చెక్‌పోస్టు ఆవరణ వద్దే ఏర్పాటు చేసి వాహనదారులకు పర్మిట్లు, ఇతర సేవలను అందిస్తూ భారీగా నగదు వసూలు చేస్తున్నారు.

తమిళనాడు రేషన్ బియ్యం స్వాధీనం

తడ, మార్చి 19: అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం అక్రమంగా రేషన్ బియ్యం రవాణా అవుతున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో నిఘా పెట్టిన అధికారులు అక్కంపేట వద్ద లారీలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న 583 బస్తాలు(21 టన్నుల) తమిళనాడు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, బియ్యాన్ని సివిల్ సప్లయిస్ గోదాములో భద్రపరిచారు. లారీని, డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్, సీఎస్ డీటీ ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

గూడూరు, మార్చి 19: ఆత్మహత్యాయత్నకు యత్నించిన యువకుడి మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు... మండలంలోని ఈదలపల్లి గ్రామానికి చెందిన సుబ్బయ్య(35) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మనస్తాపానికి గురై సోమవారం వేకువజామున ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. సుబ్బయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీలో పలువురి చేరిక

సూళ్లూరుపేట, మార్చి 19: వైసీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. మంగళవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వైసీపీకి చెందిన నేత ఉగ్గుముడి సర్పంచు తాటిపర్తి శ్రీనివాసుల రెడ్డి, మాజీ సర్పంచు తాటిపర్తి రఘురామ రెడ్డి, నాగేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ నెలబోయిన రాజసులోచనమ్మ, దొరైబాబు టీడీపీ తీర్థంపుచ్చుకొన్నారు. వారికి మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, నాయకులు కొక్కు శంకరయ్య, గాడి నారాయణ రెడ్డి, శిరసనం బేటి విజయభాస్కర్ రెడ్డి, బొమ్మన్ పళణి, మాధవనాయుడు, బుజ్జిబాబు, రఫీ, పూడి శెల్వం, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులు సమర్థంగా పనిచేయాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 19: 'నోడల్ అధికారులు జిల్లా ఎన్నికల అధికారికి కళ్లు, చెవులు వంటివారు. అందువల్ల సమర్థంగా పనిచేయాలి'అని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. పీపీటీ తయారీతో సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. విధులను అంకితభావంతో నిర్వర్తించాలన్నారు. డీఆర్వో పెంచలకిషోర్, ఎలక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ
అభ్యర్థులను గెలిపించండి
బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడి విజ్ఞప్తి



మీడియాతో మాట్లాడుతున్న కేశన శంకరరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19: సామాజిక న్యాయం లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో ఆధిపత్య కులాలకు చెందినవారే సకల రంగాలను నాశనం చేశారని విమర్శించారు. మరోవైపు జనాభాలో 80శాతం ఉన్న బహుజనులు నేటికీ అధికారానికీ, అవకాశాలకూ దూరంగా ఉండటం అన్యాయమన్నారు. మోసపూరిత వాగ్దానాలతో బహుజనులు ఐక్యం కాకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ దశలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో కలిసి ప్రాంతీయ పార్టీ ఏర్పాటు చేయాలన్న యోచనలో ఉన్నట్టు వెల్లడించారు. ఇందుకు అవసరమైన మేధో సంపత్తిని, ప్రణాళికను రూపొందించే క్రమంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్టు చెప్పారు. కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్, రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ, జనసేనకు ప్రత్యామ్నాయంగా భావ సారూప్యత గల వ్యక్తులు, శక్తులతో కలిసి కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ దఫా కొత్త పార్టీ తరఫున ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి పెట్టడం లేదన్నారు. అయితే, భావ సారూప్యత కల్గిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థుల గెలుపునకు తోడ్పడతామన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖరాచార్య, జిల్లా కార్యదర్శి గణేష్, యువజన విభాగం అధ్యక్షుడు వినోద్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదనాచారి, నాయకులు మహేష్‌యాదవ్, పొలకల సుబ్రహ్మణ్యం, ద్వారక, శ్రీను పాల్గొన్నారు.

లక్ష్యం చేరే వరకు విశ్రమించొద్దు

ఎంబీయూ విద్యార్థులకు మోహన్‌లాల్ పిలుపు ● ప్రధానిగా మళ్లీ మోదీయే రావాలన్న మోహన్‌బాబు





మోహన్‌బాబుతో మోహన్‌లాల్, మంచు విష్ణు - ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

చంద్రగిరి, మార్చి 19: ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించే వరకు విశ్రమించొద్దని ప్రముఖ సినీనటుడు మోహన్‌లాల్ విద్యార్థులకు పిలుపిచ్చారు.చంద్రగిరి మండలం, ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో విద్యానికేతన్ విద్యాసంస్థల 32వ వార్షికోత్సవం, మోహన్‌బాబు జన్మదిన వేడుకలు మంగళవారం అట్టహాసంగా జరిగాయి.ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీనటులు మోహన్‌లాల్, ముకేష్ రిషి హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యను ప్రసన్నం చేసుకొంటే ప్రపంచంలో ఏదైనా సాధించవచ్చని తెలిపారు.సినిమా రంగంలో కొనసాగుతూనే మోహన్‌బాబు విద్యాసంస్థను స్థాపించి విశ్వవిద్యాలయం స్థాయికి తీసుకురావడం అభినందించదగ్గ విషయమన్నారు.అనంతరం మోహన్‌బాబు మాట్లాడుతూ ప్రధానమంత్రిగా మళ్లీ నరేంద్ర మోదీయే రావాలని ఆకాంక్షించారు. ఏ పార్టీని నమ్మాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రాంతీయ పార్టీల గురించి తాను ప్రస్తావించనని మళ్లీ ప్రధానిగా నరేంద్రమోదీ వస్తే దేశం బాగుపడుతుందనేది తన మనసులో మాట అన్నారు. డబ్బులు అందరూ ఇస్తారని, అవి తీసుకుని మనసుకు నచ్చిన వారికే ఓటు వేయాలన్నారు.విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. హీరో విష్ణు కుమార్తె ఆరియాన ఆలపించిన పాశ్చాత్య సంగీతం ఆకట్టుకుంది.మనోజ్‌కుమార్ తనకు తండ్రితో ఉన్న అనుబంధాన్ని డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శించారు.ఎంబీయూ వీసీ నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, మోహన్‌బాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు



హారతులిస్తున్న ప్రధానార్చకుడు కరుణాకర్ గురుకుల్

వేడుకగా కాలభైరవ స్వామి ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి, మార్చి 19: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు కాలభైరవ స్వామికి అభిషేకాలు ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. స్వామి ఉత్సవ మూర్తిని అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్థూపం వరకు వెళ్లి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని అభిషేకానంతరం, భక్తులకు దర్శనం కలిగించారు. శ్రీకాళహస్తి పట్టణంతోపాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆంజనేయ స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పదహారు కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సింధూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు. భక్తులు తమలపాకుల మాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

తాగునీటికి ఇబ్బందులు... రేణిగుంటలో దాహం కేకలు

రేణిగుంట, మార్చి 19: పట్టణంలో పదిరోజులుగా తాగునీరు రాకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే రేణిగుంట పట్టణానికి పంచాయతీ ప్రధానంగా తెలుగుగంగ నీరు, బోరు ద్వారా నీటిని సరఫరా చేస్తోంది. అయితే వేసవి ఎద్దడితో కొన్ని బోర్లలో నీరు ఇంకిపోవడంతో ఉన్న బోర్లతోనే నీటి సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా వచ్చే తెలుగు గంగ వచ్చే పైప్‌లైన్ మంగళం రోడ్డులో పగిలిపోవడంతో వారం రోజులుగా రిపేరు చేస్తున్నారు. దీంతో పాంచాలినగర్, గౌరీనగర్, వినాయకనగర్, మరి కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఒక పక్క వేసవి ఎండలు, పది రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా నీటి సరఫరా ఆగిన విషయం కనీసం సమాచారం కూడా పంచాయతీ సిబ్బంది ఇవ్వకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ట్యాంకర్లకు డిమాండ్ ఏర్పడింది. పైప్‌లైన్ ఎప్పటికి మరమ్మతులు పూర్తవుతుందో, ఎప్పుడు నీరు సరఫరా జరుగుతుందో అనే ఆందోళనలో ఉన్నారు. మరో మూడు రోజుల్లో రోజులు పూర్తిస్థాయిలో రేణిగుంట పట్టణంలో నీటిని అందిస్తామని ఎంపీడీవో విష్ణు చిరంజీవి తెలిపారు.

నిత్యావసర సరుకుల వితరణ

శ్రీకాళహస్తి, మార్చి 19: ఓ కుటుంబానికి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం సరుకులను వితరణ చేశారు. శ్రీకాళహస్తి పట్టణం ప్రాజెక్టు వీధికి చెందిన మురుగేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం మృతుని కుటుంబాన్ని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం పరామర్శించి 42 రకాల నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు వడ్ల తాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు వేశారు.. వదిలేశారు



రేణిగుంట, మార్చి 19: పట్టణంలోని బుగ్గవీధిలో సీసీరోడ్డు వేసి పదిరోజులుగా మూసివేశారు. దీంతో ఆ వీధిలో నివాసముండే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే పట్టణంలోని బుగ్గవీధి పోలీసులైనులో 11 రోజుల క్రితం రోడ్డుపై మరోసీసీరోడ్డు మండల నిధులతో నిర్మించారు. దీంతో రోడ్డు క్యూరింగ్ కోసం బూడిదమట్టితో గట్లు కట్టి చేసి నీటిని పోసి వదిలేశారు. పదిరోజులు గడుస్తున్నా ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడంతో నిత్యం రాకపోకలు సాగించే స్థానికులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా రోడ్డును వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వైస్ ఎంపీపీకి కోడ్ వర్తించదా...?

● పార్టీ గుర్తుతో బోర్డు



రేణిగుంట, మార్చి 19: మండలం వైస్ ఎంపీపీకి ఎన్నికల కోడ్ వర్తించదా.. కోడ్‌అమల్లో ఉన్నా పార్టీ గుర్తు ఉన్న బోర్డును తొలగించలేదు. రేణిగుంట మండల వైస్ ఎంపీపీ సుజాత గతంలో ఆమె నడుపుతున్న దుకాణంపై నువ్వే మానమ్మకం జగన్ అని బోర్డును ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ఇప్పటి వరకు అధికారులు ఆ పక్క తలెత్తిచూడలేదు. వైస్ ఎంపీపీకి ఎన్నికల కోడ్ వర్తించదా అని స్థానిక ప్రజలు గుసగుసలాడుతున్నారు.

అంబేడ్కర్ ఫొటోతో చెరువు కబ్జా యత్నం!



కబ్జా చేస్తున్న గుత్తివారిపల్లి పెద్దచెరువు రోడ్డు పక్క ఉన్న భూమి

రేణిగుంట, మార్చి 19: అంబేడ్కర్ ఫొటో పెట్టి చెరువులో కబ్జాకు ప్రత్నించిన వైనం వెలుగుచూసింది. రేణిగుంట మండలంలో మొన్నటి వరకు కాలువలు, వంకలు, డీకేటీ ప్రభుత్వ భూములు,పోరంబోకు భూములు ఏదీ వదలకుండా ఆక్రమించుకున్నారు. అయితే ఓ ప్రబుద్ధుడు పాత విమానాశ్రయం రోడ్డులోని గుత్తివారిపల్లి పెద్దచెరువులో సర్వే నెంబరు 48లో ముళ్లకంపలు కొట్టి అంబేడ్కర్ సంఘమని బోర్డు పెట్టి కబ్జాకు యత్నిస్తున్నాడు. చెరువు భూములను సైతం కబ్జాకు యత్నిస్తుండటంతో స్థానిక మండల అధికారులు స్పందించి చెరువు భూమి కబ్జా కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. అయితే ఇటీవల ఇదే ప్రాంతంలో ఉపాధి పనులు జరిగిన భూమి ఎన్నుకుని కబ్జాకు యత్నం చేయడం గమనార్హం.

అన్నదానానికి విరాళం

శ్రీకాళహస్తి, మార్చి 19: ముక్కంటి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానం పథకానికి రూ.20 వేల నగదును కడప జిల్లాకు చెందిన రవీంద్రనాథ్ రెడ్డి అనే భక్తుడు విరాళంగా సమర్పించారు. మంగళవారం ఆలయ పరిపాలనా భవనంలో ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులకు అందజేశారు.

కాంగ్రెస్ గూటికి రాజేష్ నాయుడు



రాజేష్‌కు కండువా వేసి ఆహ్వానిస్తున్న షర్మిల

శ్రీకాళహస్తి, మార్చి 19: ముక్కంటి ఆలయ మాజీ ఛైర్మన్, దివంగత పోతుగుంట గురవయ్య నాయుడు కుమారుడు డాక్టర్ రాజేష్ నాయుడు కాంగ్రెస్ గూటికి చేరారు. టీడీపీకి చెందిన రాజేష్ నాయుడు మంగళవారం హైదరాబాదులో పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలను కలిశారు. ఆమె కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ..శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తానని తెలిపారు.

జానపద సర్వగానంకు ఆహ్వానం



జగన్నాథం

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 19: ఉపాధ్యాయుడు పోలూరు జగన్నాథంకు జానపద సర్వగానం కార్యక్రమానికి ఆహ్వానం అందింది. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న జగన్నాథంకు తిరుపతిలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ బ్లాక్‌లో ఈ నెల 24 జరగనున్న తెలుగు జానపద స్వరగానంకు ఆహ్వానం అందినట్లు పాఠశాల హెచ్‌ఎం రూపేష్ కుమార్ మంగళవారం తెలిపారు.

చంద్రబాబును కలసిన మాజీ ఎమ్మెల్యే



బాబుతో హెలెన్, హేమలత

సత్యవేడు, మార్చి 19: సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత, ఆమె కుమార్తె, సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి హెలెన్ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును మంగళవారం కలిశారు. సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ తాజా పరిస్థితి, గతంలో తమకు పార్టీ అధిష్ఠానం ఇచ్చిన హామీలను వారు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. అన్ని కార్యక్రమాలు సక్రమంగా చేసుకుపోతున్న తమకు పార్టీ అభ్యర్థిత్వం విషయంలో న్యాయం చేయాలని వారు కోరినట్లు తెలుస్తోంది.

అసమ్మతి చల్లారేలా ఆదిమూలం అడుగులు



శివయ్యశెట్టితో మాట్లాడుతున్న ఆదిమూలం

సత్యవేడు, మార్చి 19: సత్యవేడు టీడీపీ క్యాడర్‌లో గూడు కట్టుకున్న అసమ్మతిని చల్లార్చేలా టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆదిమూలం అడుగులు వేస్తున్నారు. సత్యవేడు టీడీపీ అభ్యర్థిగా ఆదిమూలం అభ్యర్థిత్వంపై నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల నిరసన హోరు కొనసాగుతోంది. ఆదిమూలం పేరును అధిష్ఠానం ఖరారు చేసినప్పటి నుంచి తెలుగు తమ్ముళ్లు నిరసనలు చేస్తూ అభ్యర్థి మార్పు విషయంలో పరిశీలించాలని కోరుతూ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేస్తున్నారు. అనూహ్యంగా వైసీపీ ఎమ్మెల్యే ఆదిమూలంకి టికెట్ కేటాయించడంపై జీర్ణించుకోని క్యాడర్‌ను కలుపుకుపోయే విధంగా ఆయన ముందుకు వెళుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల నుంచి ఆదిమూలం నియోజకవర్గంలోని అసమ్మతి నేతల ఇళ్ళకు వెళుతూ తనకు సహకరించాలని అభ్యర్థిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం పట్టణంలోని పార్టీ సీనియర్ నేత శివయ్యశెట్టి ఇంటికి వెళ్లి ఆయనను పలకరించి గెలుపుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పరమశివం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళంలో భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలి

చిలకలూరి పేటలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నిర్వహించిన ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యంపై ఎలక్షన్ కమిషన్ విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి ఆదిమూలం డిమాండ్ చేశారు. ప్రవీణ్‌కుమార్ రెడ్డి నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని పాల్గొన్న సభలో పోలీసులు ఇచ్చే భద్రత ఇదేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ సుందరరామి రెడ్డి , పరమశివం తదితరులు పాల్గొన్నారు.

రేపు పీఓ. ఏపీఓలకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో నరసింహులు

సత్యవేడు, మార్చి 19: ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ ఆఫీసర్ (పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ (ఏపీఓ)లకు ఈ నెల 21న పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి కేపీ నరసింహులు తెలిపారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో తహసిల్దార్ రామాంజనేయులు పాల్గొన్నారు.

శ్రీసిటీ గ్రామాల్లో పోలీసుల కవాతు



చెరివిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

సత్యవేడు, మార్చి 19: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసు అధికారులు సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా మంగళవారం శ్రీసిటీ పరిధిలోని చెరివిలో డీఎస్పీ వైదేశ్వరరావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, శ్రీసిటీ పరిధి పోలీసులు సంయుక్తంగా కవాతు నిర్వహించారు. మేమున్నాం...స్వేచ్ఛగా శాంతియుత వాతావరణంలో మీరు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని గ్రామస్థులకు వారు భరోసా ఇచ్చారు.

ఫ్లెక్సీలను పట్టించుకోరా...?



సచివాలయం వద్ద వైసీపీ ఫ్లెక్సీ

శ్రీకాళహస్తి, మార్చి 19: రాజకీయ ఫ్లెక్సీలను పట్టించుకోరా సారు అంటూ ప్రజ లు ప్రశ్నిస్తున్నారు. నాలుగు రోజు ల క్రితమే ఎన్నికల నియమావళి ప్రారంభమైన విషయం తెలిసిందే. ఎన్నికల అధికారు లు ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించినా కానీ శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న 9వ వార్డు సచివాలయం వద్ద వైసీపీ ఫ్లెక్సీ మాత్రం తొలగించలేదు. నిత్యం సచివాలయానికి వచ్చిపోయే ప్రజలు ఇదేం చోద్యం సారూ...అంటూ నవ్విపోతున్నారు.

అటకెక్కిన ఉచిత భోజనం

● ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహణపై దుమ్మెత్తి పోస్తున్న జనం



శ్రీకాళహస్తి, మార్చి 19: శ్రీకాళహస్తి ప్రభుత్వాసుపత్రిలో ముక్కంటి ఆలయం నుంచి ప్రతి రోజు ఉచితంగా వచ్చే భోజనాన్ని పంపిణీ చేయకుండా అటకెక్కించేశారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు కాంట్రాక్టరు ద్వారా మూడు పూట్ల నిర్దిష్టమైన పరిమాణంలో ఆహారం అందజేస్తుంటారు. అయితే ఇది కేవలం అడ్మిషన్‌లో ఉన్న రోగులకు మాత్రమే సరఫరా చేస్తారు. రోగులతో పాటు వారి సంబంధికులు ఆస్పత్రిలో నిరీక్షిస్తుంటారు. ఇక మధ్యాహ్నం ఓపీ సమయంలో వందలాది మంది రోగులు, వారి సంబంధికులు ఆస్పత్రికి వస్తుంటారు. మధ్యాహ్న భోజనం అవసరమైన వారంతా ఆర్టీసీ కూడలికి వెళ్ళక తప్పదు. ఈ సమస్యను గమనించిన గత టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసింది. ఆసుపత్రికి వచ్చేవారంతా రూ.5కే నాణమైన భోజనం అందుబాటులో ఉండడంతో పెద్ద ఎత్తున ఉపయోగించుకునేవారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్న క్యాంటీన్ మూత పడిన విషయం తెలిసిందే. ఇక మళ్లీ ఆస్పత్రిలో మధ్యాహ్న భోజనం కోసం ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పటినుంచి పలు ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆస్పత్రిలో ఉచిత భోజనం అమలు కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేశారు. పలుమార్లు ముక్కంటి ఆలయ అధికారులకు వినతి పత్రాల ద్వారా విజ్ఞప్తి చేశారు. దాంతో ఐదు నెలల క్రితం ముక్కంటి ఆలయం నిత్యాన్నదానం నుంచి ఉచితంగా ఆసుపత్రికి భోజనం సరఫరా చేసేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారం ప్రతిరోజు మధ్యాహ్నం సుమారు 150 మందికి ఆలయం నుంచి భోజనం సరఫరా చేశారు. అయితే అది మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఈనెల 1వ తేదీ నుంచి ఆస్పత్రిలో ఉచిత భోజనం పంపిణీ ఆగిపోయింది. ఆలయం నుంచి భోజనం ఇచ్చేందుకు ఎలాంటి ఆటంకం లేదు. కానీ ప్రతిరోజు భోజనం ఆస్పత్రికి చేరేందుకు, ఖాళీ పాత్రలు ఆలయానికి తిరిగి చేరవేసేందుకు రూ.200 ఆటో బాడుగ అవుతుంది. ఆసుపత్రి నిధులనుంచి రోజుకు రూ.200 కూడా వెచ్చించలేమంటూ అధికారులు చేతులెత్తేశారు. ఆసుపత్రి మెయింటెనెన్స్ నిధులు వెచ్చించే అవకాశం ఉన్నప్పటికీ ఎందుకో అధికారులు గుట్టు చప్పుడు కాకుండా ఉచిత భోజనానికి మంగళం పాడేశారు. రూ. 12కోట్లతో ప్రభుత్వ ఆస్పత్రిని అభివృద్ధి చేశామని నిత్యం పాలకులు, అధికారులు ప్రచారం చేసుకుంటున్నారు. కానీ ఆటో బాడుగ కట్టలేమంటూ నిరుపేదల కడుపు కాలుస్తున్నారు. ఈ నిర్లక్ష్యపు చర్యతో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిరోజు మధ్యాహ్నం పేదలు ఆకలితో శాపనార్థాలు పెడుతున్నారు. ఆలయం నుంచి వచ్చే నోటి కాడ కూడు లాగొద్దంటూ రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

టీడీపీలోకి పెరుగుతున్న వలసలు





టీడీపీలో చేరిన మైనారిటీలు - సుధీర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

శ్రీకాళహస్తి, మార్చి 19: టీడీపీలో వలసలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీకాళహస్తి పట్టణంలో మంగళవారం పెద్ద ఎత్తున వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జరిగాయి. శ్రీకాళహస్తి పట్టణం 18వ వార్డు వైసీపీ ఇంచార్జి చాంద్ బాషా తన అనుచర వర్గంతో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి పట్టణంలోని పూసల వీధిలో వారికి కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చాంద్ భాషా మాట్లాడుతూ వైసీపీ పాలనతో మైనారిటీల అభివృద్ధి జరగలేదని వాపోయారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్ కుమార్, ఉమేష్ రావు, నివేదిత తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా శ్రీకాళహస్తి పట్టణం 1వ వార్డు పరిధిలోని వీఎంపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు పసల ప్రసాద్ ఆధ్వర్యంలో ఆపార్టీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. మంగళవారం శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని బొజ్జల సుధీర్ రెడ్డి నివాసంలో వారంతా చేరారు. సుధీర్ వారికి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు మిన్నల్ రవి, సన్నీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడు: మండలంలోని చిట్టత్తూరు దళితవాడకు చెందిన సుమారు వందమందికిపైగా వైసీపీ నాయకులు, యువత మంగళవారం టీడీపీలో చేరారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలోని శ్రీకాళహస్తి టీడీపీ ఎమెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగృహంలో పార్టీలో చేరిన వారికి సుధీర్ రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. తొట్టంబేడు మండలంలోని సాంబయ్యపాళెం పంచాయతీకి చెందిన వైసీపీ నాయకుడు శంకర్‌రెడ్డి కుటుంబం టీడీ పీలో చేరారు. వారికి రిషితారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి గాలి చలపతినాయుడు, నాయకులు మునిరాజ నాయుడు, బాలాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సాంబయ్యపాళ్యెం పంచాయతీలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమాన్ని రిషితారెడ్డి నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ వెంకటాచలం, మండలఅధ్యక్షుడు మురళినాయుడు, ప్రతాప్ ఎరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య, జనసేన నాయకులు కొట్టే సాయి, మహేష్, శంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి కాపాడండి



భూకబ్జా సమస్యపై ఆరాతీస్తున్న సుధీర్

శ్రీకాళహస్తి, మార్చి 19: భూ కబ్జాదారుల నుంచి తమ కుటుంబాన్ని కాపాడాలని మల్లిక అనే ముస్లిం మహిళ వేడుకుంది. మంగళవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డిని కలిసి తమ ఇంటి స్థలం కబ్జా సమస్యపై వివరించింది. ఈ సందర్భంగా మల్లిక మాట్లాడుతూ...శ్రీకాళహస్తి పట్టణం 16వ వార్డుకు చెందిన తమకు రాజీవ్ నగర్‌లో ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేసి ఏకంగా ఇల్లు నిర్మించేశారని వాపోయారు. అదేమిటని ప్రశ్నిస్తే తమపైనే అక్రమంగా కేసులు పెడతామని బెదిరిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తానని సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు.

ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించండి

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 19: ఎన్నికలు విధులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కార్యదర్శులకు కేటాయించని విధులు తూచతప్పకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



కాలిపోయిన వస్తువులు

రేణిగుంట, మార్చి 19: విద్యుదాఘాతానికి ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన మంగళవారం మధ్యాహ్నం వేణుగోపాలపురంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న ఓ పేద కుటుంబం మంగళవారం పనులకు వెళ్లగా రేకుల ఇంట్లో విద్యుదాఘతం కావడంతో నగలు, డబ్బు అగ్నికి ఆహుతైంది. మంటలు చెలరేగడంతో స్థానికులు ఆర్పేశారు. అప్పటికే ఇంట్లో ఓ భాగం కాలిపోయింది. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయంచేయాలని బాధితులు కోరుతున్నారు.

గుంటుపల్లి మృతికి పలువురి సంతాపం

శ్రీకాళహస్తి, మార్చి 19: టీడీపీ జాతీయ క్రమశిక్షణ సంఘం సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు మృతి తీరని లోటని నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ అన్నారు. నరసరావుపేట లో చికిత్స పొందుతూ మంగళవారం ఆయన మృతి చెందాడు. శ్రీకాళహస్తిలో నాగేశ్వరరావు చిత్రపటానికి శ్రీకాళహస్తి టీడీపీ బీసీ విభాగం నాయకులు నివాళులర్పించి సంతాపం తెలిపారు. టీడీపీ నాయకులు మిన్నల్ రవి, డాఉమేష్ రావు, బుజ్జి, మునిరాజా యాదవ్, వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య, కృష్ణమూర్తి, కుమార్, సాయి నాయుడు, ప్రకాష్, జయకృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.2లక్షల విరాళం

ఐరాల(కాణిపాకం), మార్చి 19: స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయం వద్ద నిర్వహిసుస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు బెంగళూరుకు చెందిన దాతలు చేతన్‌కుమార్‌రెడ్డి, రమణారెడ్డి మంగళవారం చెరో లక్ష రూపాయలు చెక్కు రూపంలో విరాళంగా అందించారు. దాతలకు ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీడీపీ నాయకుడికి పలువురి శుభాకాంక్షలు



శ్రీకాళహస్తి, తొట్టంబేడు, మార్చి 19: టీడీపీ సీనియర్ నాయకుడు జగన్నాథం నాయుడు జన్మదినం మంగళవారం ఘనంగా జరిగింది. శ్రీకాళహస్తి మండలం రాసుకునేరులోని ఆయన స్వగృహం వద్ద పలువురు టీడీపీ నాయకులు జగన్నాథం నాయుడును సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జగన్నాథ నాయుడు పట్టణంలోని తన కార్యాలయం వద్ద పేదలకు అన్నదానం చేశారు. తిరుపతి పార్లమెంట్ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్ నాయుడు, మాజీ కౌన్సిలర్ ప్రసాద్ నాయుడు, టీడీపీ నాయకులు ఆయన అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇన్‌ఛార్జి ఈవోగా ఆయన వద్దంటే వద్దు

● పట్టుబడుతున్న ప్రజాప్రతినిధులు



పంచాయతీ కార్యాలయంలోఖాళీగా దర్శనమిస్తున్నఈవో కుర్చీ

రేణిగుంట, మార్చి 19: మేజర్ పంచాయతీ ఈవో సీటు కోసం కుర్చీ ఆట మొదలైంది. రేణిగుంట పంచాయతీ ఈవోగా పనిచేస్తున్న రవిరెడ్డి ఎన్నికల కోడ్ ముందు రోజే మూడు నెలలు మెడికల్ లీవ్ పెట్టి వెళ్లిపోయారు. దీంతో ఆ స్థానంలో ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారిని ఇన్‌ఛార్జిగా వేశారు. దీంతో ఆయన వస్తే తమపప్పులు ఉడకవని భావించిన ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి తెప్పించి రానీవ్వకుండా అడ్డుకుంటున్నారని సమాచారం. అయితే మరో కొత్త వ్యక్తిని ఈవోగా వేయాలని అధికారుల సూచిస్తుంటే పాత ఈవోను రప్పించాలని పట్టుబడుతున్నారు. మెడికల్ లీవ్‌లోకి వెళ్లిన ఈవో మరో మూడు రోజుల్లో విధులకు హాజరవుతారని సమాచారం.